

ఉష్ణోగ్రత (అంచనా)

21-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	27
తెనాలి	34	26
నరసరావుపేట	34	26
బాపట్ల	34	27
రెంటచింతల	34	26
చీరాల	34	27



డోర్ డెలివర్రీకి.. చెల్లుచీటి!

- ఇంటింటికీ సరుకుల పంపిణీ నిలిపివేత
- క్యాబినెట్ కమిటీ నిర్ణయంతో పాత పద్ధతికి స్వస్తి
- ఇకపై చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా ఎండీయూ వాహన సరఫరా విధానాన్ని రద్దు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ- క్యాబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. సమావేశ అనంతరం వినియోగ దారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని నిలిపివేస్తూ, గతంలో మాదిరిగానే చౌక ధర దుకాణాల ద్వారా నేరుగా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని పునరుద్ధరించేందుకు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిందని వివరించారు.

ఎండీయూపై ప్రజల్లో విముఖత

రేషన్ కార్డుదారులు ఇచ్చిన ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ప్రకారం 25% మందికి నిత్యావసర సరుకులు అందకపోవడం, 26% మంది ఎండీయూ ఆపరేటర్లు అధిక ధరలు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. దీంతో ప్రజల్లో విముఖత పెరిగింది. ప్రతి ఎండీయూ మూడు రేషన్ షాపులను ఇవ్వగా వారు నెలలో 15-17 రోజుల్లో మాత్రమే కవర్ చేస్తున్నారు. దీంతో కార్డుదారులకు సరుకులు అందడం లేదు. వాటిని దారి మళ్లించడంపై 288 కేసులు నమోదయ్యాయి. దీనికి తోడు రాష్ట్ర వ్యాప్తంగా 570 మంది ఆపరేటర్ల కొరత ఉంది. దీనికి తోడు ఈవిధానం కారణంగా ప్రభుత్వంపై రూ.353.81 కోట్ల అదనపు భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

● డోర్ డెలివరీతో వర్రీ..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 17,30,835 మంది కార్డుదారులు ఉన్నారు. వారికి 3,384 రేషన్ షాపులు అందుబాటులో ఉన్నాయి. అయితే గత ప్రభుత్వం డోర్ డెలివరీ పేరుతో జిల్లాలో 850 ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం ప్రజల కష్టాలను తగ్గించకపోగా మరింత పెంచింది. కూలీ, నాలీ చేసుకునే నిరుపేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు రేషన్ సరుకులే ఆధారం. గతంలో కూలీ పనులకు వెళ్లి వచ్చి సమీపంలో ఉన్న రేషన్ షాపుల్లో సరుకులు తెచ్చుకునేవారు. డోర్ డెలివరీ విధానంలో ఎండీయూ వాహనం తమ ఇంటికి వచ్చే రోజు కోసం కార్డుదారులు ఎదురు చూడాల్సి వచ్చేది. వాహనం వచ్చిన రోజు ఇంటి దగ్గర ఉంటే అదృష్టం.. లేదంటే ఇక అంతే! ఆ కారణంగా లబ్ధిదారులు పనులు మానుకుని ఇళ్లదగ్గర ఉండాల్సి వచ్చేది. దీంతో వారు పనిదినాలు నష్టపోయి, ఆదాయాలు తగ్గిపోయాయి. ఎండీయూ తమ వీధికి వచ్చినా, ఆ రోజు కోటా అయిపోతే మళ్లీ వారు మరుసటి రోజు కూడా పని మానుకుని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు మండు టెండలో రోడ్ల మీద ఎండీయూ వాహనాల దగ్గర గంటల తరబడి నించోవాల్సి వచ్చేది. దీంతో ఎండీయూ విధానం రద్దుచేయాలన్న డిమాండ్ గత కొంత కాలంగా బలంగా ముందుకు వచ్చింది. తాజాగా కేబినెట్ తీసుకున్న నేపథ్యంలో కార్డుదారులకు ఈ కష్టాలు తప్పినట్లే!

ప్రభుత్వం వరమిచ్చినా.. కరుణించని సాఫ్ట్‌వేర్




దేవుడు కరుణించినా.. ఎవరో కరుణించ లేదన్న చందంగా మారింది నూతన రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ. రైస్ కార్డును అర్హులైన పేదలకు మరింత చేరువ చేస్తామని సంతోషంగా ప్రకటించిన పౌరసరఫరాల శాఖ దానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాల్సిన విషయాన్ని మాత్రం మర్చిపోయింది. సర్వర్ సమస్యలతో ఒక్కో దరఖాస్తు అప్‌లోడ్ చేయడానికి రెండు గంటలకు పైగా సమయం పడుతోంది. రోజు మొత్తమ్మీద రెండు మూడుకు మించి దరఖాస్తులు పూర్తి కావడం లేదు. రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియకు ప్రభుత్వం నెల రోజులు గడువు ఇచ్చింది. ఇప్పటికే అందులో రెండు వారాలు పూర్తయ్యాయి.

- రైస్ కార్డు దరఖాస్తుల ఆన్‌లైన్‌లో తీవ్ర జాప్యం
- రెండు గంటలకు ఒక అప్లికేషన్ మాత్రమే పూర్తి
- ఒక్కో సచివాలయంలో 100కు పైగా పెండింగ్
- సాఫ్ట్‌వేర్ పాతదే కావడంతో నిరాశ
- సమస్యాత్మకంగా వివాహ ధ్రువీకరణ పత్రం
- వాట్సప్ గవర్నెన్సూ నిరాశే
- ముంచుకొస్తున్న గడువు గండం

● హౌస్‌హోల్డ్ సర్వేలో తప్పులు..

కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారికి హౌస్‌హోల్డ్ సర్వే కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. వైసీపీ ప్రభుత్వంలో పేర్ల నమోదు, ఇంటి నంబర్లు తప్పులు వేయడంతో ఇప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయి. హౌస్ హోల్డ్ సర్వే వివరాలను డిలీట్ చేయడం, సవరించడం కుదరకపోవడంతో లబ్ధిదారులకు శాపాలుగా మారుతున్నాయి. సర్వేలో లోపాలు సవరించే అవకాశం కల్పిస్తేనే అర్హులకు లబ్ధి చేకూరుతుంది.



వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోడానికి ప్రయత్నిస్తే.. ఆప్షన్స్ కనిపించని పరిస్థితి

తెనాలి, గుంటూరు మే 20, (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో చేసిన హౌస్ హోల్డ్ సర్వే లో వలంటీర్లు, సచివాలయ సిబ్బం ది చేసిన తప్పులు ఇప్పుడు నిజమైన లబ్ధిదారులకు గుదిబండలా మారుతున్నాయి. కేవలం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారికి, పాత కార్డు ల్లో పుట్టిన సంతానాన్ని చేర్చుకోవడానికి మాత్రం అవకాశం లభిస్తోంది. మిగిలిన 7 అంశాలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సచివాలయాల్లో సర్వర్ మొరాయింపు కష్టాలు ఉదయం నుంచి రాత్రి వరకు లబ్ధిదారులను పడిగాపులు కాసేలా చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో సవరణలకు అసలు అవకాశమే ఇవ్వకపోవడం, అర్హులైన లబ్ధిదారులను కూడా రాజకీయ కక్షలతో తొలగించడం వంటి కారణాలతో కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి నిరాశ తప్పడం లేదు.

పాత సాఫ్ట్‌వేర్‌తో కష్టాలు

పౌరసరఫరాల శాఖ పేదలకందించే రైస్ కార్డుల విషయంలో కొత్తవారికి అవకాశం కల్పించడం, మరో ఏడు అంశాలను సవరించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అయితే దీనికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను మాత్రం అప్‌డేట్ చేయలేదు. వైసీపీ ప్రభుత్వ కాలంలో విధించిన షరతులే ఇప్పుడూ వర్తిస్తున్నాయి. ఆరు అంచెల తనిఖీ విధానానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. రేషన్ కార్డు కోసం గత ప్రభుత్వంలో భూములు, వాహనాల విషయంలో పరిమితులు, విద్యుత్ వినియోగం యూనిట్‌ల పరిమితి వంటి వాటి ఆధారంగానే తీసుకున్న లబ్ధిదారుల అర్హతను ఇప్పుడూ నిర్ధారిస్తున్నారు. గతంలో కార్డుల్లో కోత విధించేందుకు వైసీపీ సర్కారు అనేక ఆంక్షలు పెట్టి.. చాలా కార్డులను తొలగించింది. దీంతో అర్హత ఉన్నా, చాలామంది పేద లు కార్డులు కోల్పోయారు. ఇప్పుడు అటువంటివారు దరఖాస్తు చేసుకుందామని చూస్తే మళ్లీ అవే షరతులు, అవే ఆటంకాలు వారికి రేషన్ కార్డు అందకుండా చేస్తున్నాయి.

వాట్సాప్ గవర్నెన్స్‌లో నో ఆప్షన్స్

కూటమి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చింది. 95523 00009 నంబర్‌కు కొత్త రైస్ కార్డుకు సంబంధించి ఏడు రకాల సేవలు అందుతాయని, ఈ నెల 15 నుంచి అందుబాటులో ఉంటుందని ఆ శాఖ ప్రకటించింది. అయితే సేవను ఎంపిక చేస్తే ఇవేమీ రాకుండా, దీపం స్థితి, రైస్ డ్రా స్థితి, రైస్ ఈకేవైసీ స్థితి, రైస్ కార్డు సమర్పణ వంటి కేవలం నాలుగు ఆప్షన్‌లు మాత్రమే వస్తున్నాయి. టోల్ ఫ్రీనంబర్ తెలుసుకుని వారికి కాల్ చేస్తున్నా స్పందన ఉండడం లేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

☛ కూచిపూడికి చెందిన ఓ మహిళ భర్తతో విడాకులు తీసుకుంది. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేసింది. ఇప్పుడు ఆమెకు ఒంటరి కార్డు తీసుకోవాలంటే ఎప్పు డో విడిపోయిన భర్త వచ్చి వేలిముద్ర వేయా లంట.

☛ 50 ఏళ్లు పైబడి ఒంటరి మహిళలకు కొత్త రేషన్ కార్డు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, పాత కార్డుల్లో ఉన్నవారికి ఇది వీలుకావడం లేదు. ఏ కార్డులో లేనివారికి అవకాశం లభిస్తోంది.

☛ నలుగురున్న కుటుంబంలో భార్య చనిపోయింది. ఆమెను డిలీట్ చేయాలని మరణ ధ్రువీకరణ పత్రం జత చేసి దరఖాస్తు చేస్తే, వారి పిల్లల ఆధార్ సీడింగ్ తప్పుగా నమోదైంది. దీంతో సింగిల్ పర్సన్‌ను డిలీట్ చేయటానికి వీలు కావటం లేదు.

☛ ఒకే రేషన్ కార్డులో అత్త, మామ, కొడుకు, కోడలు నలుగురున్నారు. ఆ కార్డు నుంచి కొడుకు, కోడలిని తొలగించాలంటే కోడలు రిలేషన్ దగ్గర ఎన్‌ఏ అని చూపిస్తోంది. వారి రిలేషన్ చూపడం లేదు. దీంతో వారి డిలీషన్ కూడా కుదరని పరిస్థితి.

☛ వివాహమైన వారు కొత్తగా రేషన్ కార్డు తీసుకునేందుకు.. వివాహ ధ్రువ పత్రాలు అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. వివాహ నమోదు పత్రం నంబరు, ఫొటో ఇస్తేనే సర్వర్ తీసు కుంటోంది. దరఖాస్తు అప్‌లోడ్ అవుతోంది.

రెండు గంటలకో దరఖాస్తు

రేషన్ కార్డు కోసం సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే దాని స్థితిని తెలుసుకోడానికే రోజంతా నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దరఖాస్తు ఆన్‌లైన్‌లో పూర్తిచేయాలంటే కనీసం రెండు గంటలు పడుతోంది. ఉదయం 9 గంటలకే సచివాలయాల దగ్గర దరఖాస్తుదారులు క్యూ కడుతున్నారు. గడువు తక్కువగా ఉండటం, ఈలోపే తమ దరఖాస్తు పూర్తిచేసుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి పోటెత్తడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సర్వర్ మొరాయించకుండా చేయటం కానీ, గడువు పొడిగించటం వంటి నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది. సర్వర్ సమస్యతో రోజుకు కేవలం 7 నుంచి 10 దరఖాస్తులు మాత్రమే అప్‌లోడ్ చేయగలుగుతున్నారు.

అభాగ్యులకు ఆపన్న హస్తం అన్న ఎన్టీఆర్

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య
- రాష్ట్రంలో గుంటూరు ఈస్ట్ రోల్ మోడల్: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): అన్నార్థుల, అభాగ్యులకు ఆపన్న హస్తం ఎన్టీఆర్ అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య కొనియాడారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వర్ల రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీకి కార్యకర్తలే దైవ స్వరూపమని చెప్పారు. నందమూర తారకరామారావు భౌతికంగా మన మధ్య లేకున్నా, వారు అందించిన స్ఫూర్తి, చూపించిన మార్గం, ఆచరించిన విధానాన్ని సీఎం చంద్రబాబు అనుసరిస్తున్నారని తెలిపారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగు జాతి గుండెల్లో చెరగని సంతకం అన్న నందమూరి తారక రామారావు అని పేర్కొన్నారు. పసుపు రంగునే గుండెలపై పచ్చబొట్టుగా దిద్దుకున్న పార్టీ కార్యకర్తల రూపంలో ఎన్టీఆర్ ఆశయం బతికే ఉందన్నారు. ఎన్టీఆర్ ఆశయాల సాధనకు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిరంతరం పునరంకితమవుతూనే ఉంటామని పునరుద్ఘాటించారు. వైసీపీ అరాచకాలను ఎండకడుతూ యువగళం పాదయాత్ర ద్వారా యువ నాయకులు నారా లోకేశ్ కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపారని కొనియాడారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కేవలం ఆరు నెలల్లోనే రూ.2కోట్లు వరకు ఇచ్చామని తెలిపారు. వైసీపీ హయాంలో నిలిపివేసిన స్కాలర్ షిప్ లు, మౌజన్, ఇమామ్‌ల గౌరవ వేతనం పునరుద్ధరించామని వివరించారు. నందివెలుగు బ్రిడ్జి పనులు పునఃప్రారంభించామని, శంకర విలాస్ బ్రిడ్జి శంకుస్థాపన చేపట్టామని వెల్లడించారు. బీసీ సంక్షేమ హాస్టల్ (కోడి గుడ్డు సత్రం) పనులు పూర్తి చేశామని, బీ.ఆర్ స్టేడియాన్ని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా అభివృద్ధి చేయడం కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. టీడీపీ ఆవిర్భావం పార్టీ జెండాను మోసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను ఈ సందర్భంగా ఘన సత్కరించారు. ఏపీఐడీసీ ఛైర్మన్ డేగలప్రభాకర్, రాఘవేంద్ర, డిప్యూటీ మేయర్ సజీల, మద్దిరాల మేని, దాసరి రాజామాస్టారు, పోతురాజు సమత, వేములకొండ శ్రీనివాస్, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



వర్ల రామయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్, డేగల, రాజామాష్టారు,సజీల



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మాధవి

బలహీన వర్గాల కోసం పుట్టిన టీడీపీ

● ఘనంగా గుంటూరు 'పశ్చిమ' మహానాడు

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం మాధవి నేతృత్వంలో నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమం జరిగింది. తొలుత స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మన్నవ మోహనకృష్ణ, డేగల ప్రభాకర్, మల్లె ఈశ్వరరావు, తాడిశెట్టి మురళి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆది నుంచి ప్రజల పక్షాన నిలబడిన పార్టీ తెలుగుదేశం అని ఆమె కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, 75ఏళ్ల వయస్సున్న ఆయన సుదీర్ఘ రాజకీయ అనుభవం నవ్యాంధ్రకు శ్రీరామరక్ష అని చెప్పారు. నియోజకవర్గంలో రూ. 1.28 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి అందజేశామని తెలిపారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ కడపలో మహానాడును విజయవంతం చేయాలని కోరారు. డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కడపలో జరిగే మహానాడుతో జగన్ రెడ్డి గుండెల్లో రైళ్లు పరిగెత్తాలన్నారు. తాడిశెట్టి మురళి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కృషిని చూసి పార్టీలో చేరామన్నారు. సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేశారు. త్రివిధ దళాలకు అభినందనలు, ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారికి సంతాపం తెలిపారు. అమృత్ 2.0 నిధులు, శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పునర్నిర్మాణం, రాజధాని అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. యూజీడీ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని మహానాడులో తీర్మానం చేశారు. కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, మద్దిరాల మ్యానీ, మానుకొండ శివ ప్రసాద్, తాళ్ళ వెంకటేష్, నిమ్మల శేషయ్య, మల్లె ఈశ్వర రావు, ముత్తినేని రాజేశ్, లాల్ వజీర్, కసుకుర్తి హనుమంతురావు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాలది

- మినీ మహానాడులో ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలిరూరల్, మే20 (ఆంధ్రజ్యోతి): ఆనాడు పేదవాడి ఆకలి బాధలు చూడలేక ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి కూడు, గూడు, వస్త్రం అందించి.. దేశ రాజకీయాల్లోనే పెను సంచలనంగా మారారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణ మండపంలో తెనాలి నియోజకవర్గస్థాయి మినీ మహానాడును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. నియోజవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలో ఆలపాటి మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను నటుడుగా ఉన్న ఎన్టీ



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

రామారావు గమనించి తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. అనతి కాలంలోనే ఆయన ప్రజల మన్ననలు పొంది ముఖ్య మంత్రిగా పార్టీని నిలబెట్టారన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పిస్తూ ఎన్టీఆర్ తెచ్చిన సంస్కరణలు దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా నిలిచాయన్నారు. ఎన్టీఆర్ తదనంతరం పార్టీ బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు ఆ మహనీయుడి ఆశయాలను ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని, అవమానాలు పడ్డారని గుర్తుచేసుకు న్నారు. అన్నింటినీ తట్టుకుని పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చారని గర్వపడ్డారు. తెలుగుదేశం పార్టీ ఓ కులానికో మతానికో, ప్రాంతానికో చెందింది కాదన్నారు. అన్ని వర్గాల ప్రజలు నిలబెట్టుకుంటూ వస్తున్న పార్టీ తెలుగుదేశం మాత్రమేనని చెప్పారు. తెనాలి నియోజకవర్గ టీడీపీ కుటుంబం పడ్డ శ్రమ అంతా ఇంతాకాదన్నారు. సీఎంగా చంద్రబాబు రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి పథంలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం మినీ మహానాడులో పలుతీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. తొలుత పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్సీ ఆలపాటి, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు నియోజవర్గ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కోసం శ్రమించి మృతి చెందిన నాయకులు, కార్యకర్తల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్లను స్మరించుకున్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షికారు మింగేసింది
- మూడు కుటుంబాల్లో పుత్రశోకం
- విహార యాత్ర నింపిన విషాదం

6

గుంటూరు మీదగా కొల్లం, హైదరాబాద్‌కి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు గుంటూరు మీదగా కొల్లం, హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07193 చర్లపల్లి - కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీల్లో(ప్రతీ శనివారం) రాత్రి 11.10కి బయలుదేరి ఆదివారం వేకువజామునకు ముందు 2.18కి నడికుడి, 3.43కి పిడుగురాళ్ల, 4.33కి సత్తెనపల్లి, 5.30కి గుంటూరు, సోమవారం ఉదయం 7.10కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07194 కొల్లం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 26, జూన్ 2, 9, 16, 23, 30 తేదీల్లో(సోమవారం) ఉదయం 10.45కి బయలుదేరి మంగళవారం ఉదయం 10.40కి గుంటూరు, 11.33కి సత్తెనపల్లి, 11.53కి పిడుగురాళ్ల, 12.18కి నడికుడి, సాయంత్రం 3.55కి సికింద్రాబాద్, 5.30కి హైదరాబాద్ చేరుకొంటుందన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో స్పోర్ట్స్ కోటా అడ్మిషన్లు ప్రారంభం



మంగళగిరి సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను స్పోర్ట్స్ కోటా కింద అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బీటెక్‌తో పాటు బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లోనూ అడ్మిషన్లు జరుగుతున్నాయి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు యాజమాన్యం స్పోర్ట్స్ కోటాలో ప్రవేశాలను కల్పిస్తోంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు నూరు శాతం స్కాలర్‌షిప్ అందిస్తోంది. ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.శివశంకర్, స్పోర్ట్స్ డైరెక్టర్ అనూప్‌సింగ్ సూర్యవంశీ స్పోర్ట్స్ కోటా అడ్మిషన్ల వివరాలను వెల్లడించారు. బీటెక్‌లో చేరదలిచిన విద్యార్థులకు టెన్త్, ఇంటర్‌లో 50 శాతం, బీఎస్సీ బీఏ, బీబీఏ, బీకాం కోర్సుల్లో చేరే విద్యార్థులకు 45 శాతం ఉత్తీర్ణత ఉండాలని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరున్న ఒలింపిక్ గేమ్స్, వరల్డ్ చాంపియన్‌షిప్, ఆసియా, సౌత్ ఆసియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌లో పాల్గొన్న వారు నేరుగా అడ్మిషన్ పొందేందుకు అర్హులన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు స్పోర్ట్స్ ట్రయల్స్ నిర్వహించి అడ్మిషన్లు కల్పిస్తామని చెప్పారు. ఈ నెల 26 నుంచి జూన్ 18 వరకు స్పోర్ట్స్ ట్రయల్స్ ఉంటాయన్నారు. డిగ్రీ కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీపతి నంబరు 70365 89973 సంప్రదించాలని సూచించారు.

అత్యాచార బాధితులకు.. భరోసా ఏదీ..?

- వైసీపీ హయాంలో మూడు జిల్లాల్లో కలిపి 55 కేసులు
- ఇప్పటివరకు ఉద్యోగాలు కల్పించింది ఐదుగురికే
- చర్యల కోసం కలెక్టర్లకు ప్రభుత్వ ఆదేశాలు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ (పీవోఏ) చట్టం కింద నమోదైన హత్య కేసుల్లో బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరగడం లేదు. ఈ చట్టం ప్రకారం హత్యకు గురైన వ్యక్తి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని స్పష్టంగా ఉన్నప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టలేకపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2019-2024 మధ్యన నమోదైన కేసులను పెండింగ్‌లో పెట్టడం వలన ఇప్పుడు బాధితులు నిత్యం కలెక్టరేట్ల చుటూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నా ఎస్సీలు... నా ఎస్టీలు అంటూ అధికారంలో ఉండగా బీరాలు పలికిన ఆ పార్టీ నేతలు బాధిత కుటుంబాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు వారందరికి న్యాయం చేయాల్సిన బాధ్యత టీడీపీ ప్రభుత్వంపై పడింది. అయితే తగిన ఖాళీలు లేకపోవడం, పోలీసు శాఖ నుంచి పూర్తిస్థాయి సమాచారం రాకపోవడం తదితర కారణాలతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఈ కేసులు ఎక్కువ సంఖ్యలోనే పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై ప్రభుత్వస్థాయిలో సమీక్ష నిర్వహించి బాధితులకు తగిన న్యాయం వేగవంతంగా చేయాలని మూడు జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

అత్యాచారణ నిరోధక చట్టం కింద వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లాలో 32 హత్యలు జరిగితే బాధితుల కుటుంబాల్లో కేవలం ముగ్గురికే ఉద్యోగం కల్పించారు. పల్నాడు జిల్లాలో 18 హత్యలు జరిగాయి. ఈ జిల్లాలో కేవలం ఇద్దరికే ఉద్యోగం ఇచ్చారు. బాపట్ల జిల్లాలో ఐదుగురు ఎస్సీ/ఎస్టీలు హత్యకు గురవగా, ఒక్కరికి కూడా ఇప్పటివరకు ఉద్యోగం కల్పించలేదు. దీని వలన బాధిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. ప్రతీ సోమవారం కారుణ్య నియామకాలకు సంబంధించి నియామక ఉత్తర్వులను కలెక్టరేట్ అధికారులు ఇస్తున్నారు. అయితే పీవోఏ కేసులపై శ్రద్ధ వహించడం లేదు. మూడు జిల్లాలో కలిపి ఇంకా 50 మందికి ఉద్యోగాలు కల్పించాల్సి ఉన్నది. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు జరిగిన ప్రతీసారి దళిత, గిరిజన సంఘాల ప్రతినిధులు దీనిపై అధికారులను నిలదీస్తున్నారు. అయినప్పటికీ స్పందన ఉండటం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆర్థికసాయంగా గుంటూరు జిల్లాకు రూ. 1.80 కోట్లు విడుదలైతే రూ. 96 లక్షలు ఖర్చు పెట్టారు. రూ. 83 లక్షలు ఖర్చు చేయలేకపోయారు. పల్నాడు జిల్లాకు రూ. 1.05 కోట్లు మంజూరైతే రూ. 1.04 కోట్లు ఖర్చు చేశారు. బాపట్ల జిల్లాకు రూ. 1.36 కోట్లు మంజూరైతే రూ. 1.22 కోట్లు ఖర్చు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్థికసాయం అందించడంలో కలెక్టర్లు దృష్టి పెట్టి జిల్లాలకు విడుదలైన నగదుని పంపిణీ చేయాలని, తద్వారా అదనపు నిధులకు ఇండెంట్ పెట్టుకోవాలని ప్రభుత్వం సూచించింది.

షికారు మింగేసింది

- ఎక్కడికి వెళ్తున్నారో చెప్పలేదు.. తిరిగి రాలేదు
- మూడు కుటుంబాల్లో పుత్రశోకం
- విహార యాత్ర నింపిన విషాదం
- వాడరేవు ప్రమాదంలో నగర యువకులు దుర్మరణం

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): విహారయాత్ర మూడు కుటుంబాల్లో తీరని విషాదం మిగిల్చింది. చీరాలలోని వాడరేవు వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన కారు ప్రమాదంలో నగరానికి చెందిన ముగ్గురు విద్యార్థులు దుర్మరణం చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. చేతికందొచ్చిన కొడుకులు ఇక లేరు అనే విషయం తెలిసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వారి మరణ వార్త అందిన వెంటనే రోదిస్తూ చీరాలకు చేరుకున్నారు.

నగరంలోని శ్రీనగర్ 7/5కు చెందిన పండ్ల లక్ష్మయ్య, మల్లేశ్వరి దంపతులకు కార్తిక్ ఏకైక సంతానం. లక్ష్మయ్య పాలిష్ పని చేస్తుంటాడు. కార్తిక్(19) నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో చేస్తున్నాడు. ఒక్కగానొక్క కొడుకు కావడంతో అల్లారు ముద్దుగా తల్లిదండ్రులు పెంచుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం బయటికి వెళ్తున్నానని.. ఇంటిలో చెప్పి కార్తిక్‌స్నేహితులతో కలిసి వాడరేవు వెళ్లాడు. అక్కడ జరిగిన ప్రమాదంలో కొడుకు మృతి చెందాడని పోలీసులు ద్వారా సమాచారం చేరే వరకు కూడా ఆ తల్లిదండ్రులకు కార్తిక్ చీరాల వెళ్లినట్లు తెలియలేదు. కుమారుడి మరణ వార్త విన్న వెంటనే వారు ఒక్కసారిగా కుప్ప కూలిపోయారు.

ఇదే ప్రమాదంలో రామిరెడ్డితోట 3/3 లైన్‌కు చెందిన మీసాల ఎల్లయ్య, చంద్రమ్మ దంపతుల కొడుకు అజయ్(20) కూడా మృతి చెందాడు. అజయ్ డిగ్రీ మొదటి సంవత్సరంలోనే చదువు మానేశాడు. ప్రస్తుతం హోర్డింగ్స్ కు లైటింగ్స్ ఏర్పాటు చేసే షాపులో పనిచేస్తున్నాడు. తండ్రి ఎల్లయ్య కిళ్లీ షాపులో కూలి పనికి వెళ్తుంటాడు. మధ్యాహ్నం అజయ్ షాప్‌నకు వెళ్ల లేదు. స్నేహితులు కారులో వచ్చి ఎక్కించుకొని వెళ్లారు అతను ఎక్కడికి వెళ్లాడో కూడా తల్లిదండ్రులకు తెలియలేదు.

అలాగే ఆదిత్య నగర్‌కి చెందిన రోహిత్ నాయక్(20) కూడా మృతి చెందాడు. భూక్యా భీమా నాయక్, కవిత భాయ్ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. రోహిత్ నాయక్ ఇటీవలే డిప్లమో ఫైనల్ ఇయర్ పరీక్షలు పూర్తి చేశాడు. తండ్రి భీమా నాయక్ రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.


సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకోవాలి



కెరీర్ గైడెన్స్‌వర్క్ షాపునకు హాజరైన విద్యార్థులు

పొన్నూరుటౌన్(చేబ్రోలు) మే 20 (ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థులు సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సంగం డెయిరి మేనేజింగ్ డైరెక్టర్ పి.గోపాలకృష్ణన్ అన్నారు. సంగం డెయిరి ఉద్యోగుల పిల్లలు, భవిష్యత్, విద్య, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై మంగళవారం కెరీర్ గైడెన్స్ వర్క్ షాపు సంగం డెయిరి ఆధ్వర్యంలో విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగింది. ముంబయికి చెందిన మౌంటోరియా సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్‌లో లభించే ఉపాధి అవకాశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో 21 ఏళ్లలోపు ఉన్న 200 మంది సంగం డెయిరీ ఉద్యోగుల పిల్లలు పాల్గొన్నారు. డెయిరీ చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నాటిక పోటీలు



కిడ్నాప్ నాటికలోని సన్నివేశం

వినుకొండటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న నాటిక పోటీలు పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 2వ రోజు మంగళవారం యువభేరి థియేటర్స్ హైద రాబాద్ వారి నా శత్రువు, సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ వారి హక్కు, మద్దుకూరి ఆర్ట్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటికల్లోని పలు సన్నివేశాలు అలరించాయి. మహిళా ప్రేక్షకులను నిర్వాహకులు వివిధ కూపన్ల ద్వారా ఎంపిక చేసి, రూ.2 వేలు విలువ చేసే చీరలను బహూకరించారు. దాతలతో పాటు వేదికకు ము ప్పాళ్ల చెన్నయ్య, రాపర్ల శ్రీనివాసరావు పేరుతో నాటిక పోటీలను ప్రారంభించారు. నిర్వాహకులు ముత్తినేని గిరి, బొల్లా వెంకట కోటయ్య, ప్రముఖ న్యాయవాది రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

బొల్లాపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు అటవీ ప్రాంతం నుంచి చుక్కల దుప్పి పొలాల్లోకి రావడంతో కుక్కలు వెంబడించి దాడిచేశాయి. స్థానిక రైతులు చూసి వాటిని చెదరగొట్టినప్పటికీ అప్పటికే దుప్పి మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు అక్కడికి వచ్చి దుప్పి కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం దహనం చేశారు.



ఆశ పెట్టుబడి పెట్టి రూ.19 లక్షలు కొట్టేశారు

గుంటూరు నగరంపాలెంస్టేషన్లో సైబర్ క్రైం కేసు నమోదు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : 'మీ పెట్టుబడికి మాది గ్యారంటీ.. రూపాయికి అర్థ రూపాయి లాభం ఇస్తామం.' అంటూ ఆశ కల్పించారు.. ముందుగా రూ.10 వేలు పెట్టుబడి పెట్టించి, రూ.16 వేలు వెనక్కి ఇచ్చి వారిలో మరింత ఆశ, నమ్మకాన్ని కలిగించారు. దీంతో నిజమేనా అని నమ్మిన బాధితుడు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి ఘోరంగా మోసపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీస్ స్టేషన్లో సైబర్ క్రైమ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మెడికల్ కళాశాల సమీపంలోని రైల్వే క్వార్టర్స్ లో నివాసం ఉండే శృంగారపాటి అభిరామ్ డయాలసిస్ సర్వీస్ కంపెనీలో పని చేస్తుంటాడు. తన మొబైల్‌కు గత మార్చి 7న కొన్ని మెసేజ్ లు వచ్చాయి. దాని ఆధారంగా టెలిగ్రామ్ గ్రూపులో అభిరామ్‌ను చేర్చుకున్నారు. తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలు వస్తాయంటూ ఆశ కల్పించారు. మొదట్లో కొద్ది లాభంతో.. ఆశపడిన అభిరామ్‌కు రూ.లక్ష పెట్టుబడి పెడితే లక్ష ఇరవై వేలు రూపాయలు ఇస్తామని చెప్పారు. నిజమేనని నమ్మిన అభిరాం తొలత లక్ష రూపాయలతో పాటు దఫాల వారీగా పెంచుకుంటూ పోయాడు చివరకు రూ.19,21,491లు పెట్టుబడిగా పెట్టించారు. తనకు రావాల్సిన మొత్తం ఇవ్వాలని అడగ్గా, మరో ఏడున్నర లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టాలని కోరారు. లేదంటే కనీసం రూ.నాలుగున్నర లక్షలైనా పెట్టండి అని ఒత్తిడి చేశారు. అయితే అనుమానం వచ్చిన అభిరామ్ తన డబ్బు తనకి ఇస్తే తర్వాత పెట్టుబడి పెడతానని చెప్పాడు. అయితే వారు డబ్బు ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించి 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో సైబర్ కేటుగాళ్ల ఖాతాలో ఉన్న రూ.86,361 నగదును బ్యాంకు అధికారులు హోల్డ్ చేశారు. ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

మాస్టార్లకు గ్రీన్ సిగ్నల్

- ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు..
- ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు సఫలం
- నేడు విడుదల కానున్న నోటిఫికేషన్

గుంటూరు(విద్య) మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులకు ఎట్టకేలకు రంగం సిద్ధమైంది. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో అధికారులు జరిపిన చర్చలు సఫలం కావడంతో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మంగళవారం రాత్రి లేదా బుధవారం నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాల సమాచారం నేపథ్యంలో.. ఇప్పటికే వివిధ గ్రేడ్లలో బదిలీలు, ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులకు విద్యాశాఖ సమాచారం చేరవేసింది. సిద్ధంగా ఉండాలని అందుకు అవసరమైన ప్రాథమిక సమాచారం సేకరించుకోవాలని సూచించారు.

ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. మరోవైపు ఉమ్మడి జిల్లాలో బదిలీలకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు సేకరించి నివేదిక ప్రభుత్వానికి అందజేశారు. ఉమ్మడి జిల్లాలో జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్యాల పరిధిలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులు కేటగిరిలో దాదాపు 13 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో దాదాపు 2 వేల మందికి పైగా ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీలు కావాల్సి ఉంది. మరో రెండు వేల మందికి అర్హతలను బట్టి బదిలీలు జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.

షెడ్యూలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు షెడ్యూలు ప్రకారం జరుగుతాయని అధికారులు వెల్లడించారు. తొలుత ప్రధానోపాధ్యాయులు, ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్స్‌కు నిర్వహిస్తారు. చివరిలో ఎస్‌జీటీలకు బదిలీల ప్రక్రియ కొనసాగిస్తారు. ఇలా ఉమ్మడి జిల్లాలో దాదాపు 4 వేల మందికి పైగా ఉపాధ్యాయులకు స్థాన చలనం కలగనుందని విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. నోటిఫికేషన్ విడుదల కాగానే ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటారు. ఇందులో విద్యాశాఖ నిర్దేశించిన విధంగా వివరాలను ఉపాధ్యాయులు నమోదు చేస్తారు. తర్వాత ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా బదిలీలకు సంబంధించిన కార్యక్రమం ప్రారంభమవుతుంది. తర్వాత ఉపాధ్యాయులు ఆప్షన్స్ పెట్టుకోవాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఇప్పటికే జారీ చేసింది.

సిద్ధంగా ఉన్నాం: డీఈవో

ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించి సమస్త సమాచారంతో సిద్ధంగా ఉన్నట్లు డీఈఓ సీవీ రేణుక మంగళవారం రాత్రి తెలిపారు. ఇప్పటికే పూర్తి వివరాలను ఉపాధ్యాయులకు వివరించామని నిర్దేశించిన షెడ్యూల్‌ను నిబంధనల ప్రకారం అమలు చేస్తూ కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల సహకారంతో సమర్థంగా పూర్తి చేస్తామని ఆమె చెప్పారు.

9 నెలల పాటు నిడమర్రు-కాజా ఎల్‌సీ గేటు మూసివేత

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ), అప్రోచ్ రోడ్ల నిర్మాణం నిమిత్తం నిడమర్రు - కాజా మధ్యన ఉన్న లెవల్ క్రాసింగ్ గేటు నంబరు. 10ని మూసేస్తున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది నెలల పాటు ఈ గేటు మూసి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో చినకాకాని నుంచి నిడమర్రు వెళ్లే పాదచారలు, వాహనదారులు హాయ్‌ల్యాండ్ గేటు(ఎల్‌సీ నంబరు. 11) ద్వారా ప్రయాణించాలని సూచించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



జాన్‌సైదాకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఆర్డీవో మధులత

యడ్లపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లి పిడుగుపాటుకు గురైమృతి చెందిన మండలంలోని కారుచోలకు చెందిన షేక్ పర్వీన్(34) కుటుంబాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రభుత్వం తరపున ఆదుకున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును నరసరావుపేట ఆర్డీవో మధులత సమక్షంలో పర్వీన్ భర్త జాన్ సైదాకు మంగళవారం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన మిగిలిన ఆర్థిక సాయాన్ని కూడా త్వరలో అందించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తహసీల్దార్ విజయశ్రీ, టీడీపీ నాయకులు ఉన్నారు.

23 నుంచి ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి శిబిరం



మాట్లాడుతున్న గని, చంద్రనాయక్ తదితరులు

గుంటూరు(తూర్పు), మే 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు, మల్లయ్య లింగం భవన్‌లో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ తెలిపారు. మంగళవారం గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని కళాకారులకు కొత్త కళారూపాలు, పాటల శిక్షణను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సీపీఐ వంద సంవత్సరాల వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో తయారుచేసిన పాటలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కళాకారులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుర్తింపు కార్డులు, పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు పాల్గొన్నారు.

మహానాడు తీర్మానాల కమిటీ సభ్యుడిగా ఆనందబాబు



వేమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మహానాడు తీర్మానాల కమిటీ సభ్యుడిగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నియమితులయ్యారు. 22 మందితో కూడిన కమిటీలో ఆయనకు స్థానం లభించడం పట్ల వేమూరు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి రైల్వేలైను భూములకు ఫెగ్ మార్కు

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల్లో రైల్వే లైను ఏర్పాటుకు సంబంధించి భూములను నిర్ధారించేందుకు రైల్వే, రెవెన్యూ అధికారులు ఫెగ్ మార్కు ఏర్పాటు చేయనున్నారు. ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం నుండి కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉండగా వర్షం కారణంగా బుధవారానికి వాయిదా వేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

భక్తుల భద్రతే మా బాధ్యత : పల్నాడు జిల్లా ఎస్పీ

నరసరావుపేట లీగల్, మే 20, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నుండి జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్, లోకల్ పోలీసులు పాల్గొన్నారు. జిల్లాలో ప్రజాశాం తికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. దేవాలయాలలో ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వివరాలు తెలుసుకుని, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయ అధికారులకు తగు సూచనలు చేశారు. అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక శక్తులు దాగి ఉండే అవకాశాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ రవీంద్ర, పక్కన ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ తదితరులు

వీధి కుక్కల సమస్య పరిష్కారానికి కృషి చేయాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో వీధి కుక్కల సమస్య పరిష్కారానికి జంతు ప్రేమికులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాల్సి ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, జంతు ప్రేమికులు, అధికారులతో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలో వీధి కుక్కల వలన సమస్యలు, పరి ష్కార మార్గాల పై ప్రత్యేక సమావేశం జరిగింది. మేయర్ మాట్లాడుతూ, నగరంలో వీధి కుక్కల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి శాశ్వత పద్ధతిలో చర్యలు తీసుకోవాలన్నారు. వీధి కుక్కల కుటుంబ నియంత్రణకు జీఎంసీ చేపడుతున్న చర్యలకు జంతు ప్రేమికులు సహకరించటంతో పాటు, సూచనలను రాత పూర్వకంగా అందించాలన్నారు.

కమిషనర్ మాట్లాడుతూ, వీధి కుక్కలను పట్టుకోవటం, ఏబీసీ చేయడం, అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి మూడు ప్రధానాంశాలు ఉంటాయన్నారు. వీటిలో ఏబీసీని నిపుణులైన వైద్యులే చేయాలని, మిగిలిన రెండు అంశాల నిర్వహణలో జంతు ప్రేమికుల సంస్థలు కూడా భాగస్వాములు కావాలన్నారు. అటువంటి వారికి కౌన్సిల్ ఆమోదంతో గౌరవ వేతనం అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ, వీధి కుక్కల నియంత్రణకు నగర పాలక సంస్థ అధికారులతో జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు కూడా భాగస్వాములు అవటం ద్వారా శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. సమావేశంలో తొలుత వీధి కుక్కల కుటుంబ నియంత్రణ, వ్యాక్సినేషన్ సమస్యల పై జంతు ప్రేమికుల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. సమావేశంలో సీఎంటహెచ్ డాక్టర్ అమృతం, వీఏఎస్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఉపా సెల్ పీవో రామారావు, కార్పొరేటల్ ఈరంటి వరప్రసాద్, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

అనధికార ఆశీలు వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో వీధి వ్యాపారుల నుంచి అనధికార ఆశీలు వసూలు చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నగర పాలక సంస్థ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి స్ట్రీట్ వెండింగ్ కమిటీ సభ్యులతో, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పీవీకే నాయుడు మార్కెట్, కొల్లి శారదా హోల్‌సేల్ మార్కెట్, బండ్ల బజార్ (ఫ్రూట్ మార్కెట్) ప్రాంతాల మినహా నగర పాలక సంస్థ అధికారికంగా ఎక్కడా ఆశీలు వసూళ్ళకు టెండర్లు ఇవ్వలేదన్నారు. ఆయా ప్రాంతాలు మినహా నగరంలో వీధి వ్యాపారులు ఆశీలు పేరుతో ఎవరైనా నగదు వసూలు చేస్తే, రాత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రోడ్లపై ఆక్రమణల తొలగింపులో రాజకీయ జోక్యం ఉండబోదని, అధికారులు విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శుల ద్వారా వీధి వ్యాపారుల సమగ్ర సర్వే జరుగుతుందని, వారం రోజుల్లో జోన్ల ఏర్పాట్లపై కమిటీ సూచనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. అలాగే వెండింగ్ జోన్లకు అవసరమైన ప్రాంతాలలో అంగీకారం తెలిపిన ప్రైవేట్ స్థలాలను కూడా అద్దె ప్రాతిపదికన తీసుకుంటామన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంటహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య, కార్పొరేటర్లు బొడ్డుపల్లి స్మిత పద్మజ, ఈరంటి వరప్రసాద్, సంకూరి శ్రీనివాసరావు, షేక్ మీరావలి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శిశిరంలో గులాబీలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కే జీ శంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు

ఆదర్శప్రాయుడు... ఎంసీ చాగ్లా

● హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్

గుంటూరు(తూర్పు), మే 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రిగా, సుప్రీం కోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా అనేక సంచలనాత్మక తీర్పులు వెలువరించిన గొప్ప న్యాయమూర్తి, రాజనీతిజ్ఞుడు అయిన ఎంసీ చాగ్లా జీవితం వర్తమాన భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ కేజీ శంకర్ పేర్కొన్నారు. జయ చాముండేశ్వరి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ తెలుగు అనువాదకులు కందిమళ్ల శివప్రసాద్ తెలుగికరించిన ఎంసీ చాగ్ల ఆత్మకథ శిశిరంలో గులాబీలు పుస్తకావిష్కరణ సభ స్థానిక లక్ష్మీపురం ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. గ్రంథావిష్కరణను అన్నమయ్య గ్రంథాలయ స్థాపకుడు లంక సూర్యనారాయణ ఆవిష్కరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న సాహితీవేత్త రావెల సాంబశివరావు మాట్లాడుతూ చాగ్ల గొప్ప రాజకీయ దురంధరుడు గా పేర్కొన్నారు. అనువాదకుడు శివప్రసాద్ చాగ్ల వ్యక్తిత్వాన్ని ఆయన సుదీర్ఘ చరిత్రను తన శిశిరంలో గులాబీలు పుస్తకం ద్వారా వివరించారని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వామపక్ష ఉద్యమాల నేపథ్యంలో తెలుగులో అనువాద సాహిత్యం వెలువడిందని, ప్రస్తుత తరుణంలో అనువాద సాహిత్యం తగ్గిపోవడం విచారకరమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ నెల్లూరి సత్యనారాయణ, కే దయానంద్, ప్రజాసాహితీ దివి కుమార్, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, చెరుకూరి సత్యనారాయణ, రవికృష్ణ, జయచాముండేశ్వరి పబ్లికేషన్స్ కె.జయలక్ష్మి పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ కార్మికులకు పని భద్రత కల్పించాలి

గుంటూరు(తూర్పు), మే 20 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయీస్ కార్మికులకు పని భద్రత కల్పించి, సొంత గోడౌన్స్ నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా)వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు కోరారు. స్థానిక కొత్తపేట, మల్లయ్యలింగం భవన్లో మంగళవారం జరిగిన ఉమ్మడి జిల్లా కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఠా కార్మికులకు నెల బిల్లులు మరో నెల వచ్చే వరకు అందటం లేదని అన్నారు. కార్మికులకు రావాల్సిన సౌకర్యాలను త్వరితగతిన చెల్లించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమానికి సంపతి వెంకటకృష్ణ అధ్యక్షత వహించగా, దానం, అశోక్‌రెడ్డి, నీలం రామారావు, ప్రసాదు, సురేష్, నవీన్, ఏసుబాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పాత గుంటూరు సీఐగా వెంకట ప్రసాద్

గుంటూరు కార్పొరేషన్, మే 20(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు పోలీస్ స్టేషన్ సీఐగా కె.వెంకట ప్రసాదు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పని చేసిన సోమయ్యను వీఆర్‌కు పంపారు.

నేటి నుంచి గిగ్, ఫ్లాట్ ఫామ్ కార్మికుల వివరాల నమోదు

గుంటూరు(తూర్పు), మే 20(ఆంధ్రజ్యోతి): ఈ శ్రమ్ పోర్టల్‌లో బుధవారం నుంచి గిగ్, ఫాట్ ఫామ్ కార్మికుల వివరాల నమోదు చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉప కార్మిక కమిషనర్ గాయత్రిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేది వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నమోదు కార్మిక శాఖ కార్యాలయంలో గాని సీఎస్‌సీ సెంటర్‌లో జరుగుతాయని అన్నారు. ఇతర వివరాలకు 94925 55157 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

మాతృ మరణాల నిరోధానికి క్షేత్రస్థాయిలో చర్యలు

● వైద్య సిబ్బందికి కలెక్టర్ భార్గవ్ తేజ్ ఆదేశం

గుంటూరు మెడికల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మాతృ మరణాల నిరోధానికి క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది హైరిస్క్ కేటగిరిలకు చెందిన గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి మాతృ మరణాల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతృ మరణాలపై కారణాలను విశ్లేషించి భవిష్యత్తులో ఇదే తరహాలో మరణాలు జరగకుండా తగిన నివారణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. గర్భిణుల ప్రసవానికి ముందుగానే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించేందుకు ప్రభుత్వం కల్పించిన ఉచిత రవాణ సదుపాయాన్ని ఉపయోగించుకోవాల తెలిపారు. గర్భిణులకు ప్రతి నెల 9, 10 తేదీల్లో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ద్వారా నిర్దేశిత పరీక్షలు, మందులు అందించాలని ఆయన వైద్య సిబ్బందిని ఆదేశించారు. గత అక్టోబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు జిల్లాలో నమోదైన ఐదు మాతృ మరణాలపై కలెక్టర్ భార్గవ్ తేజ సమీక్ష జరిపారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ భార్గవ్ తేజ

సంబంధిత వైద్యాధికారులు, వైద్యనిపుణులు, బాధితుల బంధువులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, డీఐవో డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, సీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు, వైద్యులు వి.అరుణ, సుధీర్, హనుమంతరావు, రాధిక రాయుడు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



ఫణికుమార్ శర్మను సన్మానిస్తున్న జనసేన నాయకులు

ఫణికుమార్ శర్మకు జనసేన నేతల సన్మానం

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత బ్రాహ్మణ సంఘం జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఫణికుమార్ శర్మను జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఫణికుమార్ సేవలు జనసేన పార్టీకే కాకుండా అందరికీ ఉపయోగపడేలా ఉండాలని, సమాజంలో ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు అడపా మాణిక్యాలరావు, కొండూరు కిషోర్‌కుమార్, కొత్తపల్లి ప్రసాద్, బొడ్డుపల్లి రాధాకృష్ణ, ఇర్రి సాయి, అందె వెంకటేశ్వరరావు, శీలం మోహన్, కొణిదేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీకి గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 20(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్ల విస్తరణ సమయంలో స్థలాలని జీఎంసీకి గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు అందించడం జరుగుతుందని, అందని వారు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌ని కలిసి వివరాలు అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ బాండ్లు అందలేదని పిజిఆర్ఎస్, గ్రీవెన్స్‌లో అర్జీలు అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారు కార్యాలయ సమయంలో నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ రాంబాబు (98499 08390)ని కలిసి తగిన వివరాలు అందిస్తే పరిశీలించి బాండ్లు అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

నగరంలో కురుస్తున్న వర్షానికి ప్రజలకు ఇబ్బంది లేకుండా నగరపాలక సంస్థ అన్నీ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. వర్షాల వలన నీరు నిలిచినా, రోడ్ల మీద చెట్లు పడినా నగర ప్రజలు తక్షణం జిఎంసి కాల్ సెంటర్ 08632345103కి కాల్ చేయవచ్చన్నారు. తాగునీటి సరఫరాకి అంతరాయం రాకుండా ఏఈలు తగిన ఏర్పాట్లతో సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. నోడల్ అధికారులు వర్షం నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. మేజర్ డ్రెయిన్ల వద్ద వ్యర్థాలు నిలిస్తే వాటిని తొలగించడానికి ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ పేర్కొన్నారు.

లక్ష మల్లెలతో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



లక్ష మల్లెల పూజతో ఆంజనేయ స్వామి

గుంటూరు కార్పొరేషన్, మే 20(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొత్తపేట శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమత్ జయంతోత్సవాలలో భాగంగా మంగళవారం పంచామృత, సపన స్వామి వారికి లక్ష మల్లెల ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిపించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర పర్యవేక్షణలో శ్రీ హనుమాన్ దీక్షా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించారు.

వైభవంగా లక్షనాగవల్లీ దళార్చన



లక్షనాగవల్లీ దళార్చనలో స్వామి

గుంటూరు(తూర్పు), మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతగుంటూరు, శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి కంకణధారణ, ఇతర హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి మూలవిరాట్‌కు లక్షనాగవల్లి దళార్చన అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పరావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు పర్యవేక్షించారు.

నేటి నుంచి హనుమత్ జయంతి ఉత్సవాలు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆర్ అగ్రహారంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో 41 హనుమత్ జయంతి మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమౌతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు అడపా కొండలరావు, కార్యదర్శి తిరుమలశెట్టి శివరామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజైన బుధవారం అగ్ని ప్రతిష్ఠాపనం, 22వ తేదీన శాంతి కల్యాణం, 23న పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం, 24న వసంతోత్సవం, 25న మహా సమారాధనం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గుంటూరు(తూర్పు), మే 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో, పని ప్రదేశాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలనే జాతీయ కార్మిక సంఘాలు పిలుపులో భాగంగా వామ పక్షాల ఆధ్వర్యంలో మంగళవారం శంకర్ విలాస్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ముత్యాలరావు, మేడా హనుమంతరావు, బి లక్ష్మణరావు, కే శ్రీనివాసరావు, బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విలువలు కలిగిన నాయకుడు పుచ్చలపల్లి

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): భ్రష్టు పట్టిన నేటి రాజకీయ వ్యవస్థలో ఉన్నత విలువలు కలిగిన పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వారు మరలా వస్తేనే వ్యవస్థ ప్రక్షాళన అవుతుందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా 'సోషలిజంతోనే నూతన సమాజం' అన్న అంశంపై మంగళవారం చర్చ జరిగింది. విశ్రాంత టెలికం అధికారి ఎస్ సదాశివం మాట్లాడుతూ సమాజం కోసం త్యాగం, ప్రజల పట్ల నమ్రత, పోరాటాలపై నిబద్ధత, మార్క్సిస్టు సిద్ధాంతంపై అచంచల విశ్వాసం పుచ్చలపల్లి సుందరయ్యని గొప్ప నాయకుణ్ణి చేశాయన్నారు. విద్యావేత్త ఆర్‌వీ సింగరయ్య, జనార్ధనరావు తదితరులున్నారు.

సాయుధ దళాల పతాక నిధికి కోస్టల్ బ్యాంకు విరాళం

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి నగరంలోని కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు గుంటూరు శాఖ రూ. లక్ష విరాళాన్ని అందజేసింది. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ ద్వారా రూ. లక్ష చెక్కును జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి ఆర్ గుణ షీలాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ తరుపున క్లస్టర్ హెడ్ జె.హరిప్రసాద్, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ మేనేజర్ ఎస్‌కే గౌస్ బాషా, కొత్తపేట బ్రాంచ్ మేనేజర్ సిహెచ్ వాణి, గోరంట్ల బ్రాంచ్ మేనేజర్ పిఎల్ ప్రశాంతి, సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని చదువు పునరుద్ధరణకు ఆర్థికసాయం

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధి భారిన పడి కోలుకొన్న మోతడకకు చెందిన విద్యార్థిని కొల్లిపాక స్వాతి ఉన్నత చదువులు కొనసాగించేందుకు దాతలు ముందుకొచ్చారు. స్వాతి కొంతకాలం క్రితం క్యాన్సర్ భారిన పడి ఇంటర్మీడియట్‌తో అర్ధంతరంగా చదువు మానేసింది. ఆ విపత్కర పరిస్థితుల నుంచి ఆమె బయట పడి తాను చదువును కొనసాగిస్తానని చెప్పడంతో ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం నాయకులు స్పందించి సాయం చేసేందుకు ముందుకొచ్చారు. స్వాతి ఎంతవరకు చదువుకొంటే అందుకు అయ్యే కళాశాల ఫీజులు, పుస్తకాలు, ఇతరత్రా ఖర్చులు తాము సమకూరుస్తామని భాష్యం స్కూల్ ఐఐటీ గణితం ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకుడు ఇందుర్తి శివన్నారాయణ తెలిపారు.

ఎస్టీ వర్గీకరణతోనే యానాదుల అభ్యున్నతి

గుంటూరు(తూర్పు), మే 20(ఆంధ్రజ్యోతి): ఎస్టీ వర్గీకరణతోనే యానాదుల సంక్షేమం, అభ్యున్నతి సాధ్యమవుతుందని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. స్థానిక గోపాలకృష్ణయ్య యానాది కాలనీ, కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన తెగలలో జనాభాపరంగా మొదటి స్థానంలో ఉన్న యానాదులు నేటికి అన్ని విధాలా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికై జూన్ 2న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బాపట్ల బ్రహ్మయ్య, బాకుల మురళీ, మేకల శ్రీనివాస్, కొమరగిరి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న అబ్దుల్ రెహ్మాన్

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : కోబాల్డ్‌పేటకు చెందిన షేక్ అబ్దుల్ రెహ్మాన్ అనే యువకుడిపై స్నేహితులే మద్యం మత్తులో కత్తితో దాడి చేసి విచక్షణారహితంగా పొడిచారు. తీవ్రంగా గాయపడిన అబ్దుల్ రెహ్మాన్‌ను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అరండల్‌పేట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అబ్దుల్ రెహ్మాన్ ఏటీ అగ్రహారంలోని చికెన్ షాపులో పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇదిలాఉంటే మంగళవారం మధ్యాహ్నం అతని స్నేహితుడై నన్నే అనే అతను ఫోన్ చేసి మద్యం తాగుదామని అరండల్ పేటలోని మయూరి బార్‌కి పిలిపించాడు. అక్కడ కొంత సేపు మద్యం తాగిన తరువాత నన్నేకు అబ్దుల్ రెహ్మాన్‌కు గొడవ జరిగింది. దీంతో నన్నే, షేక్ మాలిక్ లు కలిసి రెహ్మాన్‌తో గొడవ పెట్టుకొన్నారు. దీంతో నన్నే పట్టుకొనగా షేక్ మాలిక్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసి విచక్షణా రహితంగా 11 చోట్ల కత్తితో పొడిచాడు. దీంతో అబ్దుల్ రెహ్మాన్ తప్పించుకొని గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో చేరాడు. ఆయనకు వీపు మీద బలమైన గాయాలయ్యాయి. బాధితుడు రెహ్మాన్ ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చియార్డు అక్రమాలపై విచారణ జరపాలి

● పశ్చిమ ఎమ్మెల్యే మాధవి



జేసీ భార్గవ తేజకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చి యార్డులో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు, ఆ సమయంలో మంజూరైన లైసెన్స్‌ల గురించి సమగ్ర విచారణ జరిపించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు అక్రమాలకు అడ్డాగా చేసుకొని కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఇప్పటికే 683 లైసెన్సులు ఉన్నాయని, వైసీపీ హయాంలో 200 లైసెన్సులు అర్హత లేని వారికి ఇచ్చారన్నారు. దీనిని బినామీ పేర్లతో ఒక్కోటి 20 లక్షలకు అమ్ముకున్నారన్నారు. అంతే కాక గడిచిన ఐదేళ్లలో జీరో బిల్లు రూపంలో రూ.64.47 కోట్లు, బిల్ టూ బిల్ రూపేణా రూ.32.23 కోట్లు, కటింగ్ బిజినెస్ రూపేణా రూ.38.68 కోట్లు, రాశుల రూపేణా 1.75 కోట్లు, మచ్చకాయల రూపేణా రూ.2.50 కోట్లు, అసెస్‌మెంట్ రూపేణా రూ.75 లక్షలు, రైతులకు అందించే ఉచిత భోజనాల్లో కూడా రూ.1.50 కోట్లు, మొత్తంగా రూ.141.88 కోట్లు దోచుకున్నారని ఎమ్మెల్యే మాధవి ఆరోపించారు. మంత్రి అచ్చెన్నాయుడు మిర్చి యార్డుకు వచ్చి రివ్యూ మీటింగ్ పెట్టి, విజిలెన్స్ విచారణ జరిపి అవినీతి జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా బాధ్యులపై చర్యలు తీసుకోలేదని, మిర్చి యార్డులో ఎటువంటి అవినీతి జరిగినా తాను సహించనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తేల్చిచెప్పారు. వీటన్నిటి మీద సమగ్ర విచారణ జరపాలని, బినామీ లైసెన్సు పొందిన వారిని, అదేవిధంగా బాధ్యులైన అధికారుల మీద కఠిన చర్యలు తీసుకొని లైసెన్స్‌లు రద్దు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజకు వినతిపత్రం అందజేశామన్నారు.

ఉగ్రభూతాన్ని అంతం చేయడమే భారత్ లక్ష్యం

● ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో అంతమొందించేందుకు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పిలుపునిచ్చారు. ఆ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన చేశారు. దేశ సరిహద్దుల్లో కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకారం తెలపడం శుభసూచకమని, కానీ పాకిస్థాన్ ముష్కరులు రెచ్చగొట్టే చర్య లకు పాల్పడుతున్న వేళ అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంద న్నారు. పాకిస్థాన్ అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ జరిగిందని, ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఉగ్రభూతాన్ని అంతం చేయడమే భారత్ అసలు లక్ష్యమని ఆయన అన్నారు. దేశం కోసం పోరాడుతున్న జవానులకు మనోధైర్యాన్ని కలుగచేసేందుకు అందరం సమష్టి కృషి చేద్దామన్నారు. ఆపరేషన్ సిందూర్ భారతదేశాన్ని సగౌరవంగా తలెత్తుకునేలా చేసిందన్నారు. పహల్గాం ముష్కరుల దాడికి ప్రతీకారం తీర్చుకున్నామని అన్నారు. ఉగ్రవాదం అంతమయ్యేంతవరకు ఇది కొనసాగుతుందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్ కుటుంబానికి మోహనకృష్ణ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● అంతర్జాతీయ ఎగుమతులపై చర్చలో ఎస్‌బీఐ డీజీఎం కృష్ణకుమార్

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలను వ్యాపారవేత్తలు సద్వినియోగం చేసుకొని దేశ ఆర్థిక పరిపుష్టికి దోహదపడాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణకుమార్ బి ప్రభు పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుంటూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో స్థానిక క్యాపిటల్ హోటల్లో మంగళవారం ఎగుమతిదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎగుమతిదారులకు బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణాలు, విదేశీ మారక ద్రవ్య లావాదేవీలు పద్ధతులు, అంతర్జాతీయ పరిణామాల గురించి చర్చించారు. సమావేశంలో ఏజీఎం రామ్‌ప్రసాద్, రమేష్‌బాబు, విజయ రాఘవయ్య, సూర్యశేఖర్, మేనేజర్ శ్రీను నాయక్, ఐసీజీసీ అధికారులు ఉన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీజీఎం కృష్ణకుమార్ తదితరులు

వికాస్ హాస్పిటల్స్‌లో...బై ఫిమరల్ బైపాస్ ఆపరేషన్!

గుంటూరు మెడికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాలకు వెళ్లే బృహద్ధమనిలో రక్తం గడ్డకట్టడం అనే అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న రోగికి నగరంలోని వికాస్ హాస్పిటల్‌లో ఫిమరల్ ఆర్టరీ బైపాస్ ఆపరేషన్ జరిపి ఉపశమనం కలిగించారు. వివరాల్లోకి వెడితే... ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన 38 ఏళ్ళ యువకుడు విపరీతంగా ధూమపానం చేసే వారు. ఇటీవల ఎడమ కాలి బొటన వేలు నలుపురంగులోకి మారడం, ఎడమ కాలుకు విపరీతమైన నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం వికాస్ హాస్పిటల్‌కు వచ్చారు. వ్యాస్క్యులర్ సర్జన్ డాక్టర్ సురేంద్ర నాగులపాటి, రోగికి వైద్య పరీక్షలు జరిపారు. రోగి మూత్రపిండానికి రక్తం సరఫరా చేసే ప్రధాన రక్తనాళం అయోర్టాలో రక్తం పూడికలు ఏర్పడ్డాయని, ఎడమ తొడ ప్రాంతంలో ఫిమరల్ ధమనుల్లో కూడా రక్తం సరఫరాకు ఆటంకం కలుగుతున్నట్లు ఆయన గుర్తించారు. దీని వల్ల కాలుకు నొప్పి కలుగుతున్నట్లు రోగికి వివరించారు. అనంతరం డాక్టర్ సురేంద్ర, డాక్టర్ సురేష్‌రెడ్డి వైద్య బృందం రోగికి అయోర్టా బై ఫిమరల్ బైపాస్ ఆపరేషన్ విజయవంతంగా జరిపారు. దీని వల్ల రక్తప్రసరణ సాధారణ స్థితికి చేరడంతో రోగికి కాలు నొప్పి తగ్గడంతో పాటు బొటన వేలు గాయం కూడా తగ్గింది.

పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

గుంటూరు(తూర్పు), మే 20 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ భార్గవతేజకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాజీ పఠాన్ మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ పునరుద్ధరణకు సంఘాలతో చర్చలు జరపాలని ముఖ్యమంత్రిని కోరారు. గత ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. ఐక్యవేదిక ఛైర్మన్ చాంద్ బాషా మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని ఉద్యోగులు చేపట్టిన చైతన్య యాత్ర మంగళవారంతో ముగిసిందని చెప్పారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే 23 నుంచి రెండో విడత చైతన్య యాత్రను ప్రారంభిస్తామని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగుల చీకటి దినమైన సెప్టెంబరు 1న గుంటూరు నుంచి విజయవాడ వరకు ఉద్యోగులతో పెన్షన్ మార్చ్ పేరుతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కరిమి రాజేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, పిచ్చయ్య, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవతేజకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు



జడ్పీ కాంపౌండ్ లో చేరిన వర్షపు నీరు



శుద్ధపల్లి డొంక ప్రగతి నగర్‌లో నిలిచిన నీరు

భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

గుంటూరు కార్పొరేషన్, మే 20(ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో రోడ్లు, కాలువలు పొంగిపొర్లాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరం తడిసి ముద్దయింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నగరంలో అని రహదారులు నీటిమయంగా మారాయి. జడ్పీ కాంపౌండ్, రెడ్ క్రాస్ బిల్డింగ్ ఎదుట, పొన్నూరు రోడ్డు, కాకాని రోడ్డు, ప్రగతి నగర్, శుద్ధపల్లి డొంక ఇలా అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. రహదారులు సైతం బురద మయంగా ఉన్నాయి. నగరంలోని అనేక కాలనీలలో వర్షపు నీరు చేరి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది.

పురావస్తు శాల

అభివృద్ధికి పరితపిస్తున్న..



శిలాఫలకాలు



దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం నాగార్జున కొండ


ఆధునికీకరణకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చొరవ

టూరిజం అభివృద్ధికి కేంద్రం రూ. 25 కోట్ల కేటాయింపు

మాచర్లటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన నాగార్జున కొండ మ్యూజియం అభివృద్ధిని కాంక్షిస్తోంది. శిల్ప కళాఖండాలు, నాగార్జునుని, బుద్ధుని, శాతవాహనులు, ఇక్ష్వాకుల కాలంనాటి ప్రజల జీవనశైలికి ప్రత్యక్ష నిదర్శనం ఈ మ్యూజియం. ఇక్కడ 3, 4వ శతాబ్దపు చరిత్రను కనులకు కడుతుంది. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఈ పురావస్తుశాల అభివృద్ధిని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు గుర్తించారు. ఇదే విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి, బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా కృషి చేశారు. కానీ, ఈ నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది.

దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం

భారతదేశంలో ఏకైక ఐల్యాండ్ మ్యూజియంగా నాగార్జున కొండ ప్రపంచంలోనే రెండో అతి పెద్దది. కొండపై ఉన్న ఈ మ్యూజియం చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తోంది. 23 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగి నాగార్జున కొండ లోయప్రాంతం అపార జలరాశిలో లీనమై ఉంది. తూర్పున ఫిరంగి మోటు, దక్షిణాన ఎద్దనమోటు కొండల మధ్య గల నాగార్జున కొండ పొంగిన కృష్ణానది జలాశయంలో అద్భుత ద్వీపంగా మారింది. ప్రాచీన కాలాన ఈ కొండను శ్రీ పర్వతమని, మధ్యయుగం నుంచి నాగార్జున కొండగా పిలువబడుతోంది. 1929 ప్రాంతంలోనే నాగార్జున కొండకు దిగువన మ్యూజియం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం నదీ జలాలతో మునిగిపోయే సమయంలో 1966లో నాగార్జున కొండపై ప్రస్తుతం ఉన్న మ్యూజియాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆచార్య నాగార్జునుడు ఈ ప్రాంతంలో నివసించడం వల్ల దీనికి నాగార్జున కొండని పేరొచ్చింది. 1926 మార్చిలో శాసన పరిశోధన కార్యాలయ ఉద్యోగి ఏఆర్ సరస్వతి దృష్టి ఈ ప్రాంతంపై పడింది. 1927-31 నాటికి విశేషంగా తవ్వకాలు జరపగా కొన్ని స్థూపాలు, విహారాలు, శిలాఫలకాలు, 1938-40 తవ్వకాల్లో శిలా శాసనాలు బయల్పడ్డాయి. 1954-60 మధ్య సాగిన తవ్వకాల్లో బౌద్ధ నిర్మాణాల గురించి విశేషంగా లభ్యమయ్యాయి. వీటిలో ప్రాగ్ హైతిహాస అవశేషాలు, వివిధ వైదిక మత, గృహ నిర్మాణాలు వెలుగుచూశాయి. 1955 డిసెంబరు 10న నాగార్జున సా గర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపనకు వచ్చిన అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మ్యూజియం నిర్మించాలని ఆదేశించారు. శిథిలాల్లో కొన్నింటిని యథాతదంగా ఈ కొండపై పునర్నిర్మించారు. మరికొన్నింటిని కొలమాన ప్రతిరూపంగా ప్రదర్శించబడ్డాయి. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు నిరంతరాయంగా నాగార్జున కొండ ప్రాంతం..మానవ నివాస స్థలంగా బాసిల్లుతోంది.



మ్యూజియం లోపలి భాగం



మ్యూజియంలోని బుద్ధుని పాలరాతి విగ్రహం

ఎంపీ లావు చొరవతో రూ.25కోట్ల కేటాయింపు..కానీ..

గత పార్లమెంట్ సమావేశాల్లో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నాగార్జున సాగర్ టూరిజం అభివృద్ధికి నిధు లు కేటాయించాలని కోరారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్లో రూ.25 కోట్లు కేటాయించింది. పర్యాటక కేంద్రం ఏర్పడి 75 సంవత్సరాల తరువాత అభివృద్ధి కోసం భారీ స్థాయిలో నిధులు మంజూరు చేయడం ఇదే మొదటిసారి. నాగార్జున సాగర్ నిర్మాణ సమయంలో ఐ ల్యాండ్‌పై ఏర్పాటు చేసిన మ్యూజియంకు నేటి వరకు బడ్జెట్ కేటాయింపు లేక సరైన అభివృద్ధికి నోచుకోలేదు. బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 25 కోట్లు పొందుపరిచారే గానీ ఆ నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు. పర్యాటకులకు వసతి గృహాలు, పార్కుల అభివృద్ధి, నూతన లాంచీలు, హోటళ్లు, రిసార్ట్స్ మౌలిక వసతులు, సుందరీకరణను అభివృద్ధి చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన నిధులు త్వరగా మంజూరు చేస్తే నాగార్జున సాగర్ టూరిజం అభివృద్ధి చెంది పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

నల్లమడ వాగు విస్తీర్ణం పెంచాలి

కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : నల్లమడ వాగు పూడిక తొలిగించి వాగు విస్తీర్ణం పెంచాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. వాగు విస్తీర్ణం పెంచడానికి కావాల్సిన భూమి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నీటిపారుదల, డ్రెయినేజీశాఖల పరిధిలో నిర్వహించే ఆపరేషన్ అండ్ నిర్వహణ పనులను మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారుల బృందంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ముందుగా బాపట్ల మండలం జిల్లెళ్ళమూడిలో నల్లమడ వాగులో కోతకు గురవుతున్న కరకట్ట ప్రాంతాన్ని సందర్శించారు. బాపట్ల జిల్లాకు నీటి సరఫరా చేసే కొమ్మమూరు కెనాల్, పీటీ చానల్‌ను, నరసాయపాలెంలోని లాక్‌ల వద్ద చానల్స్ పరిశీలించారు. కట్టపై మొక్కలు నాటి నీరు పోశారు. సమ్మర్ స్టోరేజి ట్యాంక్ పూడికతొలిగించి ట్యాంక్ విస్తీర్ణాన్ని పెంచి నీటి నిల్వ సామార్థ్యాన్ని పెంచాలన్నారు. దానికి సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేయాలని నీటిపారుదలశాఖ ఎస్ఈకి కలెక్టర్ సూచించారు. సమ్మర్ స్టోరేజి ట్యాంక్ నుంచి నీటి సరఫరా 35 నుంచి 60రోజులకు పెంచాలని చెప్పారు. నరసాయపాలెంలోని చెరుకూరు ట్యాంక్ చానల్‌లో గుర్రపు డెక్క, తూటికాడ తొలిగింపు పనులను కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభించారు. నరసాయపాలెం పంచాయతీ ప్రజలు అక్కడ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పంచాయతీలో చెత్తసేకరణ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ రాజును కలెక్టర్ ప్రశ్నించారు. పంచాతీయకి ఎస్‌డబ్ల్యూ పీసీ ల్యాండ్ కోసం ప్రతిపాదనలు పంపాలని జిల్లా రెవెన్యూ అధికారికి కలెక్టర్ సూచించారు. తదుపరి నల్లమడ వాగు లాక్‌లను పరిశీలించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకటరత్నం, డ్రెయినేజి ఈఈ మురళీకృష్ణ, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా పాల్గొన్నారు.



నల్లమడ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

బ్లాక్ రైస్ బహుబాగు.. రెడ్ రైస్ రెడీ

-నూతన వంగడాల్లో బాపట్లకు అగ్రస్థానం



బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): పోషకాలు మెండుగా ఉండే అద్భుత వంగడాల సృష్టిలో బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం అగ్రభాగాన నిలిచింది. ఇప్పటికే 14 రకాల వరి వంగడాలను ఆవిష్కరించారు. మరో నాలుగు రకాలు విడుదలకు సిద్ధం చేస్తున్నారు. వాటిల్లో రెడ్ రైస్‌తోపాటు మరో మూడు వంగడాలు ఉన్నాయి. అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న బీపీటీ 5204 (సాంబమసూరి) రకాన్ని రూపొందించిన ఇక్కడ శాస్త్రవేత్తలు తాజాగా బ్లాక్ రైస్, రెడ్‌రైస్‌ను రూపొందించారు. బ్లాక్ రైస్ ఇప్పటికే విడుదలై ప్రాచుర్యం పొందింది. రెడ్ రైస్ మినీకిట్‌లు పంపిణీ చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు.

బ్లాక్‌రైస్-2841

దశాబ్దాలుగా రైతు సేవలో కొనసాగుతున్న ఈ పరిశోధన స్థానం బీపీటీ 2841 పేరుతో బ్లాక్ రైస్ వంగడాన్ని విడుదల చేసింది. బ్లాక్ రైస్‌లో బియ్యం పొర నలుపు రంగులో ఉండటం వల్ల ఫినాల్స్ ఫ్లావినాయిడ్స్ యాంటీ ఆక్సిడెంట్ యాక్టీవిటి ఎక్కువగా ఉంటాయి. దీనిని ఆహారంగా తీసుకున్నప్పుడు మధుమేహం, క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలను ఎదుర్కొనే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. దీంతోపాటుగా ప్రొటీన్, జింకు, ఇనుము, పీచు పదార్థాలు కూడా అధిక మోతాదులో ఉన్నట్లు నమోదు చేయబడింది. ప్రస్తుత మార్కెట్‌లో కిలో బ్లాక్ రైస్ రూ.300లకు పైగా విక్రయిస్తున్నారు. ఆరోగ్యవంతమైన, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం కలిగిన నల్ల ధాన్యం పంట కాలం 130 నుంచి 135 రోజులు ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో నల్ల ధాన్యం సాగు క్రమంగా విస్తరిస్తోంది. ఈ బియ్యాన్ని ఉడికించినప్పుడు అన్నం ముద్దగా మారుతుంది. అందువల్ల రోజు ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోలేం. ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది. ఆర్గానిక్‌సాగు కింద పండించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ధాన్యం సన్నగా ఉంటాయి. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో నల్ల వరివిత్తనాలు సాగు చేస్తున్నారు. ఇందులో ఆశించిన ఫలితాలు రావడంతో రైతులు నుంచి ఈ విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది సీడ్ కిలో రూ.77.8 లు చొప్పున విక్రయించేందుకు సిద్ధం చేశారు. విత్తనాలు కోసం ఇప్పటికే అనేక మంది రైతులు దరఖాస్తు పెట్టుకున్నారు.

రెడ్‌రైస్- 2858

బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం రెడ్ రైస్‌ను రూపొందించారు. ఇప్పటికే ఇది మినీ కిట్‌ల రూపంలో రైతులకు అందించి ఫలితాలను పరిశీలించారు. దీనిని ఈ ఏడాది విడుదల చేసే అవకాశం ఉంది. బీపీటీ-2858 పేరుతో రెడ్ రైస్‌ను రూపొందించారు. జింకు, ఐరన్, సూక్ష్మపోషకాలు ఇందులో అధికంగా ఉంటాయి. ఇతర ప్రాంతాల్లో పండించే ముతక రకం కాకుండా సన్న బియ్యంగా బాపట్ల రెడ్‌రైస్ ఉంటుంది. ప్రజలు తినేందుకు ఆసక్తి చూపించే విధంగా శాస్త్రవేత్తలు దీనిని రూపొందించారు. ప్రీ రిలీజు కల్చర్ కింద ఈ విత్తనాలను కిలో రూ.50కు అందించేందుకు సిద్ధం చేశారు. ఇక్కడ విత్తనాలను రీసెర్చ్ సెంటర్‌లకు, దరఖాస్తులు పెట్టుకున్న రైతులకు, ప్రైవేట్ కంపెనీలకు అందించడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఆశాజనకంగా దిగుబడులు



పరిశోధన స్థానం రూపొందించిన బ్లాక్ అండ్ రెడ్ రైస్ దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరానికి 30 బస్తాలకు తగ్గకుండా దిగుబడి లభిస్తుంది. 2023లో బ్లాక్ రైస్ విడుదల చేశాం. దీనిని అందరూ సాగు చేస్తున్నారు. రెడ్ రైస్ మినీ కిట్స్ ప్రక్రియ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధంగా ఉంది. ఆరోగ్యానికి అత్యంత అనుకూలమైన రకాలుగా పరిశోధనలో తేలింది. రైతులు, ప్రైవేట్ కంపెనీలు, సాగు చేసుకునేందుకు విత్తనాలు ఇవ్వడం జరుగుతుంది.

- డాక్టర్ జీ కృష్ణవేణి, ప్రధాన శాస్త్రవేత్త, బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం



బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం

రోడ్డు ప్రమాదాలను 50శాతం తగ్గించాలి

● జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావు పేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను 50 శాతం తగ్గించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలో సగటున నెలకు 50 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అత్యవసరంగా ప్రమాదాల సంఖ్య 25కి తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్, ఎస్పీ కంచి శ్రీనివాసరావు జిల్లా రహదారి భద్రత కమిటీ, మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2023, 2024లో జిల్లాలో వరసగా 576, 612, 2025 ఏప్రిల్ నాటికి 263 ప్రమాదాలు జరిగాయని గణాంకాలు వివరించారు. 2024లో 380 మంది మరణించగా.. ఈ ఏడాది నాలుగు నెలల్లో 152 మరణాలు సంభవించాయని తెలిపారు. ద్విచక్ర, భారీ వాహనాలు అత్యధిక ప్రమాదాలకు కారణమవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని, రోడ్లపై నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రవాణ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో జిల్లాలోని అన్ని రోడ్లపై తనిఖీలు నిర్వ హించాలని చెప్పారు. కాలేజీ విద్యార్థులు, రైతు కూలీలు పరిమి తికి మించి ఆటోలు, ట్రాక్టర్లలో ప్రయాణించడం ఎంత ప్రమాదమో వివరించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 34 బ్లాక్ స్పాట్లలో ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు రోడ్డు ప్రమాదాల సరళిని మెరుగ్గా అంచనా వేయడంలో తోడ్పడుతున్నా యన్నారు. ప్రిస్క్రిప్షన్ లేని డ్రగ్స్ అమ్మకాలను నిరోధించండి ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో డ్రగ్స్ అమ్మకాలను నిరోధించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై కళాశాలల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, ఆర్ అండ్ బీ ఎస్ఈ రాజా నాయక్, జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్, డీఎంహెచ్ఓ రవి, డీఈవో చంద్రకళ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ఐదు స్కానింగ్ కేంద్రాలకు అనుమతి

● ఆరు కేంద్రాల రద్దు

● ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షతన పీసీ పీఎన్‌డీటీ కమిటీ సమావేశం

గుంటూరు మెడికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వెల్లడిస్తే జైలు శిక్ష తప్పదని గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ హెచ్చరించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం (పీసీ పీఎన్‌డీటీ యాక్ట్)పై జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి చట్టం గురించి, జిల్లాలో దాని అమలును వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ

ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ మాట్లాడుతూ జిల్లాలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ముందుగానే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతి పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో కొత్తగా ఐదు స్కానింగ్ కేంద్రాల అనుమతులకు, ఆరు స్కానింగ్ కేంద్రాలు రద్దుకు, మరో 25 కేంద్రాలు మార్పుల కోసం దరఖాస్తు చేసుకున్నారని డీఎంహెచ్ఓ విజయలక్ష్మి తెలిపారు. వీటికి కలెక్టర్ ఆమోదం తెలిపారు. కృత్రిమ గర్భధారణ పద్ధతులపై వైద్య చికిత్సలు అందించే లెవెల్ 1 స్థాయిలో రెండు ఆసుపత్రులు, లెవెల్ 2 స్థాయికి ఒక ఆసుపత్రి దరఖాస్తు చేసుకున్నట్లు డీఎంహెచ్‌వో చెప్పగా, కలెక్టర్ ఆమోదించారు. సరోగసి కేంద్రం దరఖాస్తు గురించి చెప్పగా.. ఆ కేంద్రం పాత సరోగసి కేసులు వివరాలు ఆరోగ్య శాఖకు అందజేస్తే, పరిశీలించి అనుమతి మంజూరు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీడ్స్ డైరెక్టర్ డి.రోషన్ కుమార్, డాక్టర్ అనిత, డాక్టర ఆదిలక్ష్మి, డాక్టర్ రవీంద్ర నాయక్, డీపీఆర్‌వో శ్యామ్‌కుమార్, డెమో ఎ.జయప్రసాద్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, వాణి, నిర్మల మేరి పాల్గొన్నారు.

వర్ష బీభత్సం..

◆ తడిచిన మొక్కజొన్న పచ్చి ఇటుకలు ◆ అకాల వర్షాలతో తీవ్ర నష్టం



వర్షానికి తడిసిన మొక్కజొన్న గింజలు

కొల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం తెల్లవారుజామున వర్షం భీభత్సం సృష్టించింది. కొల్లూరు మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం నాలుగు గంటల పాటు ఏకధాటిగా కురిసింది. ఈ వర్షానికి మాగాణి పొలాల్లో ఆరబోసిన మొక్కజొన్న గింజలు పూర్తిగా తడిసిపోయాయి. లంక గ్రామాల్లో తుది దశకు వచ్చిన ఇటుక పరిశ్రమను వర్షాలు వెన్నాడటంతో పరిశ్రమదారులు తీవ్రంగా నష్టపోయారు. మంగళవారం కురిసిన వర్షం ధాటికి కల్లాల్లో ఆరబెట్టిన లక్షలాది పచ్చి ఇటుకలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. ఎన్నడూ లేని విధంగా మే నెలలో అకాల వర్షాలు కురవడం వల్ల మొక్కజొన్న రైతులు, ఇటుక పరిశ్రమదారులు కోలుకోని విధంగా దెబ్బతిన్నారు. భారీ వర్షం ధాటికి రోడ్లు మొత్తం పూర్తిగా జలమయం అయ్యాయి. కొన్ని చోట్ల పల్లపు ప్రాంతాల్లోని గృహాలు సైతం వర్షపు నీరు చేరింది. మురుగు కాల్వలు పొంగి పొర్లడంతో మురుగు మొత్తం రోడ్లపైకి చేరి రోడ్లన్నీ జుగుప్సాకరంగా మారాయి. పిడుగులు ధాటికి కొన్ని గృహాల్లో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది మేలో వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందని భావించినప్పటికీ అకాల వర్షాలతో వర్షాకాలాన్ని తలపిస్తుంది. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం.



తడిసి పోయిన పచ్చి ఇటుకలు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పున్నమ్మ చెరువు స్థలంపై విచారణ 23కి వాయిదా

తాడికొండ, మే 20(ఆంధ్రజ్యోతి): తాడికొండ అడ్డరోడ్డులో ఉన్న పున్నమ్మ చెరువు స్థలంపై అధికారుల విచారణ 23కి వాయిదా వేసినట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడికొండ అడ్డరోడ్డులో చెరువుగా ఉన్న స్థలాన్ని ఆక్రమించారని పొన్నెకల్లులో ఏప్రిల్ 14న సీఎం చంద్రబాబునాయుడు పర్యటించినప్పుడు గ్రామస్థులు, సీపీఐ నాయకులు సీఎంకు అర్జీని అందజేశారు. దీంతో స్పందించిన సీఎం ఉన్నతాధికారులకు పున్నమ్మ చెరువు ఆక్రమణపై విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా సీఎంవో కార్యాలయం నుంచి గుంటూరు జిల్లా కలెక్టర్‌కు పున్నమ్మ చెరువుపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. దీనిపై ఇప్పటికే జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ పున్నమ్మ చెరువు స్థలాన్ని పరిశీలించారు. చెరువుకు సంబంధించిన పూర్తి రికార్డును అందజేయాలని తాడికొండ తహసీల్దార్‌ను ఆదేశించారు. తహసీల్దార్ చెరువు స్థలానికి సంబంధించిన పూర్తి రికార్డును జేసీకి అందజేశారు. అంతే కాకుండా అర్జీలు దాఖలు చేసిన వారిని ఈ నెల 21వ తేదీన తాడికొండ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేస్తున్నట్లు తేదీ నిర్ణయించగా.. దానిని 23వ తేదీకి వాయిదా వేసినట్లు తెలియజేశారు.

వాయిదాలకు హాజరుకాని ముద్దాయి అరెస్టు

మంగళగిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్న వారెంట్ ముద్దాయిని అరెస్టు చేసినట్లు మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. విజయవాడ కొత్తపేటకు చెందిన ఎస్ దుర్గారావు గత ఏడాది కాలం నుంచి కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తిరుగుతున్నాడని చెప్పారు. న్యాయస్థానం దుర్గారావుపై ఎన్‌బీడబ్ల్యూ ఇవ్వడంతో కోర్టు ఆదేశాల మేరకు ముద్దాయిని అరెస్టు చేశామన్నారు. న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు. కోర్టు కేసుల్లో ఉన్న ముద్దాయిలు క్రమం తప్పకుండా వాయిదాలకు హాజరుకావాలని సూచించారు.

బాలిక అదృశ్యంపై కేసు

తాడికొండ, మే 20(ఆంధ్రజ్యోతి): బాలిక కనిపించటం లేదంటూ తాడికొండ పోలీస్‌స్టేషన్ మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జోజిబాబు పేర్కొన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పొన్నెకల్లు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలి కూలి పనులు చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వలికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కూలీ పనుల కోసం పెదకాకాని మండలం నంబూరుకు వెళ్లి ఏడునెలల క్రితం తిరిగి పొన్నెకల్లు వచ్చారు. ఈ నేపథ్యంలో ఈనెల 15వ తేదీన కుటుంబసభ్యులు రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. 16వ తేదీన తెల్లవారుజామున 4 గంటలకు తల్లి నిద్ర లేచి చూడగా బాలిక కనిపించలేదు. దీంతో బాలిక కనిపించలేదని బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించగా అచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలిక కనిపించటం లేదని తల్లి మౌలాబి మంగళవారం తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హైకోర్టులో ఉద్యోగాలు ఇపిస్తానని మోసం

తాడికొండ, మే 20(ఆంధ్రజ్యోతి): హైకోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి డబ్బులు తీసుకున్న వ్యక్తిపై తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ కే.వాసు మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే బండారుపల్లి గ్రామానికి చెందిన మధిర రవికుమార్ నిరుద్యోగిగా ఉంటు ప్రైవేటు ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే గుంటూరు అశోక్‌నగర్‌కు చెందిన హోప్ హెచ్‌ఆర్ కన్సల్టెన్సీని నిర్వహిస్తున్న బాధినీడి పాపారావు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పటంతో పాటు, ఏపీ హైకోర్టులో ఉద్యోగం కల్పిస్తానని చెప్పి తప్పుడు ఉద్యోగ నియామక పత్రాలు చూపించిన పాపారావుకు రూ.4.25 లక్షలు, అతడికి సన్నిహితుడైన మోతుకూరి అమర్నాథ్‌కు రూ.లక్షా10వేలు ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఉద్యోగాలు ఇప్పించక పోగా డబ్బులు తిరిగి ఇవ్వమని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకుండా బెదిరిస్తూ హింసిస్తున్నారని ఆరోపించారు. దీంతో తాము మోసపోయామని గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తుళ్లూరు, మే 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దొండపాడు గ్రామంలో నివాసం ఉంటున్న చలపాల సుబ్బయ్య(35) తుళ్లూరు మండలం బోరుపాలెంలో ఉంటున్న తల్లిదండ్రులను చూడటానికి ఈ నెల 15న వచ్చాడు. 16న బైకు తీసుకొని బయటకు వెళ్లాడు. ఎక్కడికి వెళుతున్నాడో ఇంట్లో చెప్పలేదు. రాజధాని గ్రామం దొండపాడు సీడ్ యాక్సెస్ రోడ్డు మీద బైకుపై నుంచి పడిపోయి ఉన్నాడు. 17న తెల్లారిన తరువాత స్థానికులు గమనించి గుంటూరు జీజీహెచ్‌కి తరలించినట్టు తెలిపారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడున్నారు. తుళ్లూరు ఎస్ఐ కలగయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

23న మెగా కంటి వైద్యశిబిరం

వట్టిచెరుకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజల కోసం ఈ నెల 23న కాటూరి మెడికల్ కళాశాల, హాస్పటల్ సౌజన్యంతో ముట్లూరు గ్రామం లోని శివాలయం వద్ద మెగా మెడికల్ ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహి స్తున్నట్లు గ్రామ పెద్దలు, యువకులు వెల్లడించారు. వివిధ రకాల మెడికల్ సేవలతో పాటు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్‌లు చేయిస్తారని తెలిపారు.

శిథిలావస్థలో దశాబ్దాల నాటి కట్టడం

- పశువుల ఆస్పత్రి వంతెనను విస్తరించాలి
- గత ప్రభుత్వ హయాంలో రూ.2.25కోట్లతో పైపై మెరుగులు
- నూతన నిర్మాణం చేపట్టాలని తాడేపల్లి వాసుల వినతి



భారీ వాహనాల తాకిడికి దెబ్బతిన్న రెయిలింగ్



తాడేపల్లిలోని పశువుల ఆస్పత్రి వద్ద వంతెన

తాడేపల్లి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): 60 ఏళ్ల క్రితం వ్యవసాయ అవసరాల కోసం నిర్మించిన ఆ వంతెన.. నేడు మారిన పరిస్థితుల కారణంగా పెరిగిన ట్రాఫిక్, భారీ వాహన రాకపోకల తాకిడితో శిథిలావస్థకు చేరింది. ఏళ్లతరబడి తాడేపల్లి గ్రామ వాసులు, రైతులు అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా పట్టించుకున్న వారు లేరు. వంతెనపై రెండు ఎడ్ల బండ్లు కూడా ఎదురు బొదురు తిరగలేని పరిస్థితి. తాడేపల్లి ప్రధాన జాతీయ రహదారి మార్గం నుంచి పాత జాతీయ రహదారి వైపు రావడానికి పశువుల ఆస్పత్రి వద్ద ఉన్న ఈ వంతెన ఉపయోగపడుతుంది. అలాగే వంతెనపై సమీపంలో ఉన్న ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇంకా రైల్వే యార్డు పలు రకాల గోడౌన్లకు వచ్చే లారీలకు, గూడ్సు వాహనాలకు పాఠశాల బస్సులకు ఈ వంతెనే ప్రధాన మార్గంగా మారింది. దీంతో వంతెన బలహీనపడటంతో పాటు స్తంభాలకు పగుళ్లు వచ్చి శిథిలావస్థకు రావడంతో 1996లో భారీ వాహనాలు తిరక్కుండా వంతెనకు ఇరువైపులా ట్రాఫిక్ నియంత్రణ దిమ్మెలు ఏర్పాటు చేశారు. నాబార్డ్ ద్వారా నిధులు తెచ్చి పనులు చేస్తామని అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. అప్పటి నుంచి పశువుల ఆస్పత్రి వంతెన సమస్యకు పరిష్కారం దొరకలేదు.

రూ.2.25కోట్లతో పైపై మెరుగులు

గత వైసీపీ హయాంలో పశువుల ఆసుపత్రి వంతెనకు రూ.2.25కోట్లతో మరమ్మతులు చేపట్టి పైపై మెరుగులు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆయన నివాసం నుంచి వంతెన అవతల ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు వెళ్లడానికి యుద్ధ ప్రాతిపదికన ఈ మరమ్మతులు చేపట్టారు. పగుళ్లిచ్చిన చోట ప్లాస్టరింగ్ చేసి రంగులద్ది మెరుగులు దిద్దారు. కానీ వంతెన సమస్య మాత్రం తీరలేదు. నిత్యం ఈ వంతెనపై ట్రాఫిక్ సమస్యలే. ఉదయం వేళల్లో పాఠశాలలకు వెళ్లే బస్సులు, రాజధాని ప్రాంతానికి వచ్చే కార్లు, ఇక్కడ ట్రాఫిక్ స్తంభిస్తే గంటల తరబడి వాహన చోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని తాడేపల్లి వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వమే పొగాకును కొనుగోలు చేయాలి

● అగ్రికల్చర్ డైరెక్టర్ డిల్లీ రావును కోరిన రైతులు



పొగాకు రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న అగ్రికల్చర్ డైరెక్టర్ డిల్లీ రావు

ప్రత్తిపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): మా వద్ద నున్న పొగాకును ఎవరూ కొనడం లేదని, ప్రభుత్వం అయినా కొనుగోలు చేయక పోతే భారీ స్థాయిలో రైతులు నష్ట పోవాల్సి వస్తుందని అగ్రికల్చర్ డైరెక్టర్ డిల్లీరావును రైతులు వేడుకున్నారు. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలోని పొగాకు బ్లాక్ బర్లీ పండించిన రైతులను అగ్రికల్చర్ డైరెక్టర్ డిల్లీ రావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్న వెంకటేశ్వరరావు, సహాయ సంచాలకులు తోటకూర శ్రీనివాసరావులు కలుసుకున్నారు. రైతులు నిల్వ ఉంచిన పొగాకును పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పొగాకును కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. దీని వలన పండించిన పొగాకు మొత్తం నిల్వ చేయాల్సి వచ్చిందని వాపోయారు. ఎకరాకు లక్షన్నర వరకు ఖర్చు అయిందన్నారు. ఐదేళ్లుగా పంటలు సరిగా లేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వచ్చారని, ఈ ఏడాది పొగాకు రైతులను ఆదుకోక పోతే రైతుల పరిస్థితి దయనీయంగా మారుతుందని డిల్లీ రావు వద్ద రైతులు వాపోయారు. మండలంలో సుమారు 1500 ఎకరాల్లో పొగాకు బ్లాక్ బర్లీని సాగు చేశామని, 16వేల క్వింటాళ్ల నిల్వలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు కొత్తమల్లాయపాలెంలో పర్యటించారు. అక్కడ పొగాకు పండించిన రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి

● ముప్పాళ్ల నాగేశ్వరరావు



ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

తాడేపల్లి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. సోమవారం రాత్రి తాడేపల్లి పట్టణంలోని సీతానగరం సీపీఐ శాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లి మంగళగిరి ప్రాంతంలో ప్రజలకు అండగా ఎర్ర జెండా నిలుస్తుందని ప్రజలకు మేలు చేయడానికి పనిచేసే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని వ్యాఖ్యానించారు. ఇటీవల అమరావతి రాజధానికి మోదీ వచ్చి ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వలేదన్నారు. 2014లో మట్టి నీళ్లు ఇచ్చారని, ఇప్పుడు ఒట్టి మాటలే చెప్పారని విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గంలో 25వేల మంది పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని 50 ఏళ్ళుగా రైల్వే కాలువ, కొండ, ఫారెస్టు పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్నవారికి మంత్రి నారా లోకేశ్ పట్టాలు ఇప్పిస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, తొలి విడతగా కొన్ని పట్టాలు ఇచ్చారని, అందరికి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఆరు గ్యారెంటీ హామీలను ప్రజలకు ఇచ్చిందని, వాటిని తక్షణమే అమలు జరపాలని మహాసభ డిమాండ్ చేసిందన్నారు. ఈ మహాసభలో శీలం శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షత వహించారు. సీపీఐ సీతానగరం శాఖ కార్యదర్శిగా శీలం శ్యామ్‌ప్రసాద్, కమిటీ సభ్యులుగా చలవాది గౌరి, అనిల్, బోసు, పాల గొర్ల తిరుపతమ్మ ఎన్నికయ్యారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న టీడీపీ నేతలు

తుళ్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో పేద చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్నట్టు టీడీపీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుళ్లూరు, దొండపాడు, రాయపూడి గ్రామాలకు చెందిన చిరువ్యాపారులకు 13 తోపుడు బండ్లను, టిఫిన్ బండ్లను మాజీ మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్ కుమార్ ఆర్థిక సహకారంతో అందజేశారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా చిరు వ్యాపారులకు విడత ల వారిగా 413 తోపుడు బండ్లును కిరణ్ కుమార్ అందజేశారు. తద్వారా వారి కుటుంబాలకు తమ వంతు చేయూతను అందిస్తున్నట్టు ఆయన చెప్పారు. పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటే పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఈ సందర్భంగా కిరణ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో తుళ్లూరు గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, నాయకులు జమ్ముల అనిల్, కొల్లి నరేంద్ర, మూల్పూరి రాంబాబు, జమ్ముల హరికిరణ్(బాబి) షేక్ అల్లా భక్షు, ఇందుర్తి శివుడు, అల్లా భక్షు, షేక్ సైదులు, తాళ్లూరు దయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలి : ఈమని

ఫిరంగిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మంగళవారం ఫిరంగిపురంలో జరిగిన రైతు, కౌలు రైతు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మిర్చి, పొగాకు, పత్తి, శనగ పంటలకు గిట్టు బాటు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. గుండాలపాడు, బేతపూడి గ్రామాల్లో పేదలకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ ప్రసాదరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

మంగళగిరి సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 8 గంటల పని దినాన్ని కొనసాగించాలని రాజధాని ప్రాంత మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.రవి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎర్రబాలెం, నిడమర్రు గ్రామాల్లో మునిసిపల్ కార్మికులు పని విరామ సమయంలో నిరసన తెలియజేశారు. రవి మాట్లాడుతూ కార్మికుల శ్రమను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే పాలకులు లేబర్ కోడ్‌లను తీసుకువస్తున్నారని ధ్వజమెత్తారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రవేటీకరణ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూని యన్ నేతలు టీ బాబు, ఓ రామారావు, ఆదిలక్ష్మి, కే కోటేశ్వరీ, ఎం పార్వతి, ఎస్‌కే సుభాని, టీ.తిరుమలేశ్, శివకోటి, పాండు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కడప మహానాడును జయప్రదం చేయాలి

● టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు

వట్టిచెరుకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ మహానాడు ఈనెల 27, 28, 29 తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా కడపలో నిర్వహిస్తున్న మహానాడును జయప్రదం చేసేందుకు మండలంలోని గ్రామాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి జయ ప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. వట్టిచెరుకూరులో గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మినీ మహానాడు జయప్రదానికి తరలి వచ్చిన పార్టీ నాయకులు, శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా రాంగోపాల్



మామిళ్లపల్లి రాంగోపాల్, దేవిరెడ్డి శ్రీనివాసరావు,ప్యారీజాన్

కాకుమాను, మే 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా మామిళ్లపల్లి రాంగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల కార్యాలయంలో మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో రాంగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడిగా దేవిరెడ్డి శ్రీనివాసరావు, తెలుగుమహిళ మండల అధ్యక్షురాలిగా ప్యారీజాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన మండల అధ్యక్షుడిని, కార్యవర్గ సభ్యులను టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లా వీరయ్య చౌదరి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్, నల్లమోతు పూర్ణచంద్రరావు, బోడపాటి ప్రసాద్‌లు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వధువుకు పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందిస్తున్న చిగురుపాటి సుబ్బారావు తదితరులు

తాడేపల్లి (గుండిమెడ), మే 20 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామంలో సుద్దుల ప్రసన్న దంపతుల కుమార్తె వివాహానికి హాజరై వధువు సుప్రియకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను టీడీపీ నేతలు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండిమెడ గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, నామతోటి రాంబాబు, ఎం కిషోర్ తదితరులు పాల్గొని ఆశీర్వచనాలు తెలిపారు.

ముగిసిన పోలేరమ్మ తిరునాళ్ల

పెదనందిపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలేరమ్మ తల్లి తిరుణాల మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి మహిళలు పెద్దఎత్తున గ్రామ వీధుల్లో ఊరేగింపుగా నీళ్ల తీసుకువచ్చి తలంట్లు పోశారు. పొంగళ్ల, చద్దులు వండి మొక్కుబడులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని డప్పువాయిద్యాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. డీఎఫ్‌సీ యూత్, చౌదరి యూత్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు.

మంత్రి లోకేశ్‌చే సన్మానం ఊహించలేదు

● మాచర్ల, పల్నాడు జిల్లా, జడ్పీ బాలికోన్నత పాఠశాల



షేక్ సమీరా

మా నాన్న ఎలక్ట్రీషియన్. మేము ముగ్గురు అక్కాచెల్లెళ్లం. ఇద్దరు చెల్లెళ్లు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. లోకేశ్ మంత్రిగా వచ్చిన తర్వాత స్టడీ మెటీరియల్ అందించారు. ప్రీఫైనల్స్‌కు ముందు జిల్లా స్థాయిలో నిర్వహించిన సమావేశాలు ఉపయోగపడ్డాయి. లోకేశ్‌తో సన్మానం అందుకుంటానని అస్సలు ఊహించలేదు. మా ఎమ్మెల్యే జిల్లా ఫస్ట్, సెకెండ్ వచ్చిన వారికి రూ.లక్ష చొప్పున బహుమతులు అందించారు. ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం. ఆ తర్వాత పేద విద్యార్థులకు ఉచితవిద్య అందించేందుకు కృషి చేస్తాను.

వంద రోజుల యాక్షన్ ప్లాన్‌తో సక్సెస్

రాజమహేంద్రవరం, తూగో జిల్లా, జడ్పీ హైస్కూల్



కనితి కిషోర్

పదవ తరగతిలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ సత్ఫలితాలను ఇచ్చింది. నవంబర్ 18 నుంచి మార్చి 10 వరకు రివిజన్ టెస్ట్ నిర్వహించారు. మార్చి 3 నుంచి 13 వరకు గ్రాండ్ టెస్ట్‌లు జరిగాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాగా ప్రోత్సహించారు. అంగవైకల్యం ప్రతిభకు అడ్డుకాదని నిరూపించాలని చెప్పారు. గతంలో కంటే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కింద అందించిన కిట్లు నాణ్యతగా ఉన్నాయి. వీటిపై ఎలాంటి పార్టీ గుర్తులు లేవు. పేదలకు అండగా నిలిచేందుకు ఐఏఎస్ కావాలన్నదే నా లక్ష్యం.

అనంతవరం ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు



టీటీడీ బోర్డు మీటింగ్‌లో అనంతవరం వెంకన్నస్వామి ఆలయానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు సమావేశంలో వెల్లడిస్తున్న ఈవో శ్యామలరావు, పక్కన సదాశివరావు

తుళ్లూరు(అనంతవరం), మే 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామం అనంతవరం కొండపై స్వభువుగా ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత మీసాల వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి టీటీడీ రూ.10 కోట్లు కేటాయించింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ ఆలయాన్ని టీటీడీ వారు దత్తత తీసుకున్నారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, వైభవంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తూ మంగళవారం బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ బోర్డు డైరెక్టర్ దొండపాడు వాసి, నాట్కో సంస్థ ప్రతినిధి నన్నపనేని సదాశివరావు ఆలయాన్ని సందర్శించిన నేపథ్యంలో రైతులు ఆలయ అభివృద్ధి గురించి వినతిపత్రం అందజేశారు. టీటీడీ బోర్డు మీటింగ్‌లో సదాశివరావు ఈ అంశాన్ని తీసుకొచ్చారు. ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు నిధులు మజూరు చేస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సదాశివరావు మాట్లాడుతూ రాజధాని వాసుల కోరిక మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆకాంక్ష మేరకు అనంతవరం ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు నిర్ణయించిన ఛైర్మన్, ఈవో, అడిషనల్ ఈవో వెంకటయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మాలంకు అలాగే టీటీడీ సిబ్బందికి సహచర బోర్డు సభ్యులకు, అదేవిధంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌లకు సదాశివరావు కృతజ్ఞతలు తెలియజేశారు. నిధులు మంజూరుపై అమరావతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాబ్‌మేళాకు 589 మంది అభ్యర్థులు హాజరు

● సద్వినియోగం చేసుకున్న రాజధాని యువత



జాబ్‌మేళాకు హాజరైన రాజధాని యువత

తుళ్లూరు, మే 20,(ఆంధ్రజ్యోతి): సీఆర్డీఏ, ఏపీ స్కిల్ డెవెలప్‌మెంటు కార్పొషన్ ఆధ్వర్యంలో తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను రాజధాని యువత సద్వినియోగం చేసుకున్నారు. ఈ మేళాలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిటైల్, ఆటోమొబైల్, హెల్త్ కేర్, ఐటీ సేవలు, ఫైనాన్స్ రంగాలకు చెందిన 11 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. జాబ్ మేళాకు 589 మంది అభ్యర్థులు హాజరు కాగా, పలువురు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. సంస్థల ప్రతినిధులు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు జాబ్ మేళాలో 100 మంది అభ్యర్థులు ఆఫర్ లెటర్లు అందుకోగా, 170 మంది అభ్యర్థులు తదుపరి రౌండ్లకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య శిక్షణ అధికారి సాయి శ్రీనవాస్, ప్లేస్‌మెంట్ అధికారి అరుణకుమారి సమన్వయ బాధ్యతలు నిర్వహించారు. అలాగే ఎన్ఎసీ అసిస్టెంట్ డైరెక్టర్ వి.నరసిహారావు, సీఆర్డీఏ డీసీడీవో బి.శ్రీనివాసరావు, సీనియర్ లైలీహుడ్ ఆఫీసర్ శంకర్ తదితరులు పాల్గొని జాబ్‌మేళాను నిర్వహించారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక సిబ్బందిని నియమించి రిజిస్ట్రేషన్, ఇంటర్వ్యూల నిర్వహణ పక్రియను ప్రశాంతంగా నిర్వహించారు

పుల్లడిగుంటలో మేయర్ నానికి ఘన స్వాగతం



నగర మేయర్‌కి స్వాగతం పలుకుతున్న ఉప్పుటూరి చినరాములు

వట్టిచెరుకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరమేయర్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా వట్టి చెరుకూరు మండలంలోని పుల్లడిగుంటకి వచ్చిన కోవెలమూడి రవీంద్ర(నాని)కి ఘన స్వాగతం లభించింది. మండల నాయకుడు ఉప్పుటూరి చినరాములు ఆధ్వర్యంలో మేయర్‌ని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చినరాములు ట్రస్టు సేవలను మేయర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నవ వంశీకృష్ణ, మాజీ సర్పంచ్ ఉప్పుటూరి గోవర్ధనరావు, కార్పొరేటర్ ఈరంటి బాబు పాల్గొన్నారు.

శ్రీధనలక్ష్మీదేవిగా శ్రీమహంకాళీ అమ్మవారు



శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీమహంకాళీ అమ్మవారు

దుగ్గిరాల, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటిగా వెలుగొందుతున్న కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం 48వ పునఃప్రతిష్ఠ మూడోరోజు ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శనివారం నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అమ్మవారు శ్రీధనలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలో పలువురు దంపతులతో శ్రీచండీహోమం జరిపించారు. కృష్ణ చైతన్య నేతృత్వంలో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, తారక్‌నాధ్‌శర్మ, మణిశర్మలు హోమంలో పాల్గొన్న దంపతులతో పూజా కార్యక్రమాలు జరిపించారు. ప్రత్యేక పూజల అనంతరం హోమంలో పాల్గొన్న దంపతులతో పాటు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈవో కోగంటి సునీల్, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్‌లు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. చిలువూరు, కేఆర్‌కొండూరు, మంచికలపూడి గ్రామాల్లో, అమ్మవారి గ్రామోత్సవం బుధవారం నిర్వహించనున్నారు.

ఆసక్తిగల వారు పేర్లు నమోదు చేసుకోవాలి

పెదనందిపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో బుధవారం నుంచి విద్యార్థులకు, మహిళలకు నెల రోజులపాటు జెండూబామ్, ఫినాయిల్, సోప్ ఆయిల్, సర్ఫ్ తయారీపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కొల్లా రాజమోహనరావు మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

తెనాలి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): న్యూ ఢిల్లీ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఇందుకు మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో అదాలత్ జరుగుతుందని తెనాలి స్పెషల్ జడ్జి ఎం.ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. అన్ని రకాల సివిల్, క్రిమినల్, భరణం, బ్యాంకు దావాలు, ప్రమాదాల కేసులు పరిష్కరిస్తామని తెలిపారు. తెనాలి న్యాయ స్థానాల ప్రాంగణంలోని అన్ని కోర్టుల కక్షిదారులు అవకాశాన్ని వినియోగించుకుని రాజీ ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవాలని కోరారు.

తూములూరులో అధ్వానంగా పారిశుధ్యం



సిమెంట్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- స్తంభించిన మురుగు నీరు
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని అధికారులు

కొల్లిపర, మే 20 (ఆంధ్రజ్యోతి): పూడుకుపోయిన కాల్వలు... ఇళ్ల చుట్టూ పేరుకుపోయిన మురుగు ... కాలు బయట పెట్టలేని పరిస్థితి ... భరించలేని దుర్గంధం ... విజృంభిస్తున్న దోమలు ఇవీ మండల పరిధిలోని తూములూరు ఎస్సీ, బీసీ కాలనీల్లో కష్టాలు. గత మూడు రోజులుగా కుంభవృష్టితో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు పడటంతో ఎక్కడి నీరు అక్కడ స్తంభించి పోయాయి. వర్షాలు పడటం తగ్గినప్పటికి నీరు ఏ మాత్రం కదలక పోవకపోవడంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నోమార్లు ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఈ పరిస్థితి గురించి కాలనీ వాసులు మొరపెట్టుకున్నారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారే తప్ప సమస్య మాత్రం పరిష్కరం కాలేదు. దీంతో తూములూరు ఎస్సీ, బీసీ కాలనీవాసులు మురుగునీటితో సతమతమవుతున్నారు. డ్రెనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడ నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భరించలేని దుర్వాసనతో పాటు



తూములూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



తూములూరు రామాలయం వద్ద నిలిచిన మురుగు నీరు

మురుగు నీటిలో దోమలు వృద్ధి చెంది రాత్రివేళ కంటిమీద కునుకు లేకుండా పోతుందంటూ కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీల్లో లక్షలాది రూపాయలతో సిమెంటు రోడ్డును నిర్మాణం చేపట్టారు. సిమెంటు రోడ్లకు ఇరుపక్కలా డ్రెయినేజి ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడి నీరు అక్కడ స్తంభించిపోయింది. గృహాల చుట్టూ నీరు చేరుకుంది. సిమెంటురోడ్డు పక్కన మురుగునీరు నిలిచిపోవడంతో వేసిన రోడ్లు కూడా ఎక్కడ దెబ్బతింటుందేమోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మురుగునీరు నిలిచిపోవడంతో అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని తూములూరు ఎస్సీ, బీసీ కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉరుములు, మెరుపులతో తెనాలిలో భారీ వర్షం

తెనాలి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం భారీవర్షం కురిసింది. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ఉరుములు, మెరుపులతో ఎనిమిది గంటల వరకు వర్షం పడింది. గాలులు వీయడంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. ప్రతి వర్షానికి పట్టణంలో పలు రహదారులు నీట మునిగేవి. మురుగు కాల్వలు, పూడిక తీత, వ్యర్థాలు భారీఎత్తున తొలగించడంతో ముంపు సమస్య పెద్దగా లేకుండా పోయింది. కొత్తపేటలోని ప్రధాన రహదారులు, రోడ్లు ఈ వర్షానికి కాస్తంత నీరు నిలబడింది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టణంలో ఎక్కడ రోడ్లపై నీరు నిలవకూడదని ఆదేశించడంతో మున్సిపల్ యంత్రాంగం పెద్దఎత్తున కాల్వల్లో వ్యర్థాల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. వర్షం కురిసినప్పుడు కూడా జేసీబీతో కాల్వల్లో వ్యర్థాలను ట్రాక్టర్లతో తరలించడంతో రహదారుల ముంపు సమస్య నుంచి ఉపశమనం లభించింది. మండుతున్న ఎండల్లో పడుతున్న వర్షాలు ప్రజానీకానికి ఊరటనిస్తున్నాయి.

రామాలయ సప్తమ వార్షికోత్సవం

తెనాలి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రగడ కోటయ్యనగర్‌లోని రామాలయంలో పద్మావతీ అమ్మవారి మందిర సప్తమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఉంజల్‌సేవ, ప్రత్యేక పూజలు, అర్చకులు కొండపి దత్తుశర్మ ఆధ్వర్యంలో కోదండ రాంబాబు, అన్నపూర్ణ దంపతులు నిర్వహించారు. అంది బాలచంద్రమౌళి, రాజేశ్వరి, తన్మయి, రాజు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● టీడీపీ సీనియర్ నాయకుడు రఫీ

కొల్లిపర, మే 20 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ రఫీ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర ముస్లిం కాలనీలో ఇటీవల షేక్ సయ్యద్‌బీ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆర్థిక సాయంగా రూ.5వేలు నగదును ఇవ్వడంతో టీడీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ ఐసాన్, వల్లభాపురం బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో జూదరుల అరెస్టు

తెనాలిరూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ సాయంతో జూదరులను అరెస్టు చేశారు. అంగలకుదురు - కోపల్లె రోడ్డులో పేకాట ఆడుతున్న ఐదుగురుని డ్రోన్‌ను పంపి గుర్తించి అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1000 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రేషన్ కార్డుల నమోదుపై వీఆర్వోలతో సమావేశం

తెనాలి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి రేషన్ కార్డుల నమోదు, మార్పులు చేర్పులు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో మండలంలోని వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట,మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య పనులను మెరుగుపర్చాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. మంగళవారం స్థానిక చెంచుపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. డ్రెయిన్లలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించేలా చర్యలు చేపట్లామని మురుగు నీటి పారుదలలో ఎటువంటి అడ్డంకులు లేకుండా ప్రత్యేక ప్రణాళికలతో స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని, పారిశుధ్య కార్మికులకు ఇంటివద్దే అందించాలని సూచించారు. అనంతరం రామలింగేశ్వరపేటలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఈవోపీఆర్‌డీ భార్గవ్

కొల్లిపర, మే 20 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈవోపీఆర్‌డీ భార్గవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చివలూరు, కొల్లిపర పంచాయతీ కార్యాలయాలను ఆయన తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా రోడ్లపై వర్షపు నీరు నిలబడకుండా చూసుకోవాలన్నారు. కాల్వల్లో మురుగునీరు తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు పక్కన వ్యర్థాలను కాల్చితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తడి చెత్తను, పొడి చెత్తను తప్పనిసరిగా వేరుచేయాలన్నారు. తనిఖీలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధస్సుకు పదును

● మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు



చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు తదితరులు

పొన్నూరు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): చదరంగం క్రీడతో మేధస్సుకు పదును పెరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలాజీ బాల మందిర్‌లో పొన్నూరు చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఓపెన్, బాలికల విభాగం అండర్ 11 చెస్ చాంపియన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు వివేక విద్యాసంస్థల డైరెక్టర్ ఉప్పల సుకుమార్‌బాబు, ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు పోటీలను ప్రారంభించి చిన్నారులతో చదరంగం ఆడారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ గంగరాజు మురళీకృష్ణ వంటి అంతర్జాతీయ చదరంగం కోచ్ పొన్నూరు ప్రాంతంలో ఉండడం గర్వకారణమన్నారు. గ్రామీణ వాతావరణ నేపథ్యం ఉన్న పొన్నూరు నుంచి ఎందరో అంతర్జాతీయ చదరంగం క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. పాఠశాలల్లో చదరంగం క్రీడను ప్రోత్సహించాలని కమిషనర్ సూచించారు. పోటీలలో అండర్ 11 విభాగంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన చిన్నారి క్రీడాకారులు పోటీలలో తలపడ్డారు. కార్యక్రమంలో కీర్తి హాస్పిటల్ డాక్టర్ కీర్తి, అకాడమీ కార్యదర్శి షేక్ బాజీ బాబా తదితరులు పాల్గొన్నారు.



పెదకాకానిలో జరిగిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు

పెదకాకానిలో తిరంగా ర్యాలీ

పెదకాకాని, మే 20 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని సైనికులకు మద్దతుగా పెదకాకానిలో కూటమి నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. మంగళవారం పెదకాకాని మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి శివాలయం వరకు జాతీయ జెండాను పట్టుకొని పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ, నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం-జనసేన-బీజేపీ పార్టీల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు నెంబర్లు, పార్టీల అనుబంధ కమిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

సైనిక సత్తా చాటిన ఆపరేషన్ సిందూర్

● తహసీల్దార్ శ్రీనివాసవర్మ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో భారతదేశ సైనిక పాటవాన్ని, సత్తాని పాకిస్థాన్‌కు భారతదేశం చాటి చెప్పిందని తహసీల్దార్ శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన



తిరంగా యాత్రలో పాల్గొన్న కూటమి పార్టీల నాయకులు, అధికారులు

చేబ్రోలులో ఎన్డీయే కూటమి, మాజీ సైనికులు, ప్రజల ఆధ్వర్యంలో సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్వతంత్ర్య యోధుడు సుభాస్ చంద్రబోస్ విగ్రహానికి నాయకులు నివాళులు అర్పించారు. జాతీయ పతాకాన్ని చేతబూనిన నాయకులు చేబ్రోలు వీధులలో పర్యటించి పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించారు. త్రివిధ దళాలకు వందన సమర్పణచేసి ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన సైనికులు, ప్రజలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, బీజేపీ మండల అధ్యక్షుడు నారిశెట్టి శ్రీరామ చంద్రమూర్తి, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమత్ జయంత్యుత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలందుకున్న సువర్చల సమేత వీరాంజనేయస్వామి వార్లఉత్సమూర్తులు

పొన్నూరు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలకు మంగళవారం అంకుర్పారణ జరిగింది. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా అర్చక స్వాములు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయంలో గణపతి పూజ జరిపి విశ్వక్సేనారాధన నిర్వహించారు. హనుమత్ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలకు ఆలయం సిద్ధం అయ్యింది. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే హనుమత్ దీక్షా పరులు ఇరుమడులు చెల్లించేందుకు దీక్షలు, విరమించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. బుధవారం వేకువజామున పంచామృత అభిషేకాలు, ఏకశిల వీరాంజనేయస్వామి వారికి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ఈవో గద్దె వెంకట అమర్నాథ్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీదాసాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



తమలపాకు పూజలో ఆంజనేయస్వామి

తెనాలి, మారీసుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీదాసాంజనేయ స్వామి వారి 16వ వార్షిక మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీవిద్యాపీఠంలోని పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) వారి స్వయం పర్యవేక్షణలో దాసాంజనేయ స్వామివారికి ప్రత్యేక సుగంధద్రవ్యాలు, సింధూరంతో అభిషేకాలను నిర్వహించి 1108 వడలు, తమలపాకులతో అలకరించి నివేదించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాధం, రాజేశ్వరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీవిద్యాపీఠంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

అప్పలస్వామి ఆలయంలో...

తెనాలి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): మారీసుపేటలోని అప్పలస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు మంగళవారం మొదలయ్యాయి. వీరాంజనేయస్వామి వారి తమలపాకులతో పూజ చేశారు. వడమాల, అప్పాలమాల సమర్పించారు. పంచామృతాభిషేకం, పండ్ల రసాలు, డ్రై ఫ్రూట్స్‌తో అభిషేకాలు చేశారు. మన్యసూక్త హోమం నిర్వహించారు. ధర్మకర్తలు శివానందకుమార్, నారాయణస్వామి, శివాంజనేయప్రసాద్, అర్చకులు ఆంజనేయశాస్త్రి, సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షించారు. మారీసుపేట శివాలయంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలలో వీరాంజనేయ స్వామి వారికి సామూహిక సిందూరార్చన చేశారు. మహిళా బృందం లక్ష హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.